మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 9-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 191 Issue: 191

Published from Jagitial
www.evarthalu.com

09 జనవరి 2026 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 5:54 తిథి షష్టి ఉ. 7:05 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) మ. 1:39 వరకు తరువాత హస్త యోగం శోభన సా. 4:57 వరకు కరణం వనిజ ఉ. 7:05 వరకు విష్టి రా. 7:44 వరకు వర్జ్యం రా. 10:46 నుండి రా. 12:30 వరకు దుర్ముహూర్తం ఉ. 9:04 నుండి ఉ. 9:48 వరకు మ. 12:45 నుండి మ. 1:29 వరకు రాహుకాలం ఉ. 11:00 నుండి మ. 12:23 వరకు యమగండం మ. 3:08 నుండి సా. 4:31 వరకు గుళికాకాలం ఉ. 8:15 నుండి ఉ. 9:37 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు ఉ. 6:05 నుండి ఉ. 7:46 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:01 నుండి మ. 12:45 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# ట్రంప్ దెబ్బ..!

## భారత్‌పై 500 శాతం టారిఫ్ మోత

### కీలక బిల్లుకు వైట్ హౌజ్ గ్రీన్ సిగ్నల్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరో బాంబు వేసేందుకు రెడీ అవుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై ఏకంగా 500 శాతం సుంకాలు విధించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు కీలక బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ విషయంపై రిపబ్లికన్ సెనెటర్ లిన్స్ గ్రాహం ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు.

వాషింగ్టన్: ట్రంప్‌తో జరిగిన భేటీలో పలు కీలక విషయాల గురించి చర్చలు జరిపినట్టు తెలిపారు. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు అధ్యక్షుడు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఈ బిల్లుపై వచ్చే వారం ఓటింగ్ జరగనుందని వెల్లడించారు. ఉక్రెయిన్‌లో పుతిన్ చేస్తున్న దారుణాలకు రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్, చైనా, బ్రెజిల్ దేశాలు పరోక్షంగా మద్దతు ఇస్తున్నాయని గ్రాహం ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా బిల్లు ప్రకారం ఆయా దేశాలపై 500 శాతం సుంకాలు విధించే అధికారం అమెరికాకు ఉంటుందని గ్రాహం తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందితే రష్యా నుంచి ఇతర దేశాలు చమురు కొనడం తగ్గుతుందని లిన్స్ గ్రాహం ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు తరువాయి 2 వ పేజీలో...



మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో జాతరకు రావాలని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క. గురువారం ఎర్రవల్లి ఫాంహౌజ్‌కు వచ్చిన మహిళా మంత్రులను కేసీఆర్ సతీమణి శోభమ్మ పసుపు, కుంకుమ, వస్త్రాలు, తాంబూలాలతో సత్కరించారు.

# మార్కెట్ అబ్బ!

## 8 లక్షల కోట్లు హుష్ కాకి



### కుప్ప కూలిన స్టాక్ మార్కెట్

### ట్రంప్ 500 శాతం టారిఫ్ దెబ్బ

### రోజంతా అమ్మకాల ఒత్తిడి

ఈ మధ్య కాలంలో ఎన్నడూ లేని విధంగా స్టాక్ మార్కెట్ గురువారం భారీగా నష్టపోయింది. గత కొన్ని రోజులుగా సూచీలు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. కానీ గురువారం మాత్రం మార్కెట్ క్రాష్ అయింది. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి.

ముంబై: భారత్, అమెరికా మధ్య వాణిజ్యం కొలిక్కి రాకపోవడం ఒక కారణం అయితే...రష్యాపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు భారత్ పై 500 శాతం సుంకాలను విధిస్తామని, దానికి సంబంధించిన బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం కూడా మార్కెట్ ను దెబ్బ తీసింది. దీంతో విదేశీ మదుపర్లు విపరీతంగా అమ్మకాలు చేపట్టారు. అలాగే ప్రస్తుతం నడుస్తున్న భౌగోళిక ఉద్రిక్తతలు కూడా మార్కెట్ సెంటిమెంట్ మీద ప్రభావం తరువాయి 2 వ పేజీలో...



జాతీయ విద్యా విధానం తరహాలోనే తెలంగాణ లోనూ తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ (టీఈపీ) తీసుకురాబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యా విధానం కోసం ఇప్పటికే ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించామని, త్వరలోనే ఆ పాలసీని అమలులోకి తీసుకొస్తామని చెప్పారు. సచివాలయంలో సీఎం రేవంత్ ను హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ కుమార్ బృందం మర్యాదపూర్వకంగా కలిశారు.

# తెలంగాణకు టీఈపీ

### విద్యావిధానానికి కమిటీ వేశాం

### త్వరలోనే ఆ పాలసీ అమల్లోకి

### హిమాచల్ మంత్రితో రేవంత్

హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): తెలంగాణ విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను హిమాచల్ ప్రదేశ్ మంత్రికి సీఎం వివరించారు. ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ విద్యను అందించే విధానాన్ని అమలు చేస్తామని రేవంత్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ ప్రారంభించడమే కాకుండా తరువాయి 2 వ పేజీలో...



# నలుగురి బలి కోరిన వేగం

### నలుగురు విద్యార్థులు దుర్మరణం

### రంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం

రంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాద సంఘటన చోటుచేసుకుంది. వేగంగా ప్రయాణిస్తున్న ఓ స్పోర్ట్స్ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో నలుగురు యూనివర్సిటీ విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన మీర్జాగూడ సమీపంలో జరిగింది.

రంగారెడ్డి, జనవరి 8 (ఈవార్తలు): మృతులంతా ఐసీఎఫ్ఏఐ యూనివర్సిటీలో చదువుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. ఐసీఎఫ్ఏఐ విద్యార్థులైన సూర్యతేజ, సుమిత్, శ్రీ నిఖిల్, రోహిత్ మోకిల నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. మీర్జాగూడ వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జు కాగా, అందులో ఉన్న నలుగురు విద్యార్థులు తీవ్ర గాయాలతో తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,800 |
| వెండి (గ్రాము): | రూ.272 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,566 |




# మున్సిపాలిటీలకు తలో 10 కోట్లు

హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి మరో విడత నిధుల విడుదలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 138 మున్సిపాలిటీలకు పలు దఫాలుగా నిధులు మంజూరు చేసిన సర్కార్, తాజాగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ద్వారా నిధులు రూ.10 కోట్లు మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా సీఎం రేవంత్ సర్కార్ నిధుల విడుదలను వేగవంతం తరువాయి 2 వ పేజీలో...

# పట్నంలో ఓట్ల జాతర


### రాజకీయ పార్టీలతో ఈసీ భేటీ.. ఎన్నికల నిర్వహణ, ఓటర్ డ్రాఫ్ట్‌పై చర్చ

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. అన్ని రాజకీయ పార్టీల నేతలతో గురువారం ఎస్ఈసీ సమావేశం అయ్యింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, ఓటర్ డ్రాఫ్ట్, పోలింగ్ స్టేషన్ల వివరాలపై చర్చించింది. ఇప్పటికే కలెక్టర్లు, మున్సిపల్ అధికారులతో ఎన్నికల సంఘం సమావేశమైంది. ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలకు సర్కారు రెడీ కావడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం హీటెక్కింది.



హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): పార్టీ సింబల్స్‌పై జరిగే ఎన్నికలు కావడంతో ప్రధాన పార్టీలన్నీ చాలెంజ్‌గా తీసుకుంటున్నాయి. ఇప్పటికే మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి నేతలు బస్తీబాట పట్టారు. పంచాయతీ ఎన్నికల్లో 66 శాతం సర్పంచ్‌స్థానాలను గెలిచిన కాంగ్రెస్.. అదే ఊపుతో మున్సిపాలిటీలపైనా మూడు రంగుల జెండా ఎగరేయాలని ఉత్సాహంతో ఉన్నది. ఈ సారి మున్సిపల్ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ తోనే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికలు జరిగే117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పరిధిలో బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా 124 తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



12 ఏళ్ల లోపు ని వయసున్న పిల్లలను అత్యాచారం చేస్తే ఉరి శిక్ష విధించేలా అమెరికాలోని ఫ్లోరిడా సర్కారు 2023లో చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం తీసుకొచ్చినప్పటి నుంచే అక్కడ పిల్లలపై అత్యాచారాలు తగ్గుముఖం పట్టాయి.



# కావాలంటే పిల్లల్ని పెంచుకోండి

### సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: వీధి కుక్కల కేసు కీలక మలుపు తిరిగింది. 'కుక్కలు వద్దు.. పిల్లలను పెంచండి' అంటూ సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానిం చింది. జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎన్వీ అంజారి యాలతో కూడిన బెంచ్ ఈ కేసును విచారించింది. వీధుల్లోని అన్ని కుక్కలను తరలించ మని తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని చెప్పింది. కేవలం సంస్థలు, కార్యాలయాల నుంచి మాత్రమే తరలించమన్నామని కోర్టు స్పష్టం చేసింది. కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సందీప్ -2 వ పేజీలో...



# దమ్ముంటే ఖమ్మంలో పోటీ చెయ్

## కేటీఆర్ కు పొంగులేటి సవాల్

### ఖమ్మంలో గెలవడం మీ నాన్న వల్లే కాలేదని ఎద్దేవా

### ఇంటి సమస్యలను పరిష్కరించుకోవాలని చురక

హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చాలెంజ్ విసిరారు. దమ్ముంటే ఖమ్మం జిల్లాలో పోటీ చేయాలని సవాల్ చేశారు. జిల్లా పర్యటనకు వచ్చి గొప్పలు చెప్పడం మానుకోవాలని చెప్పారు. కేటీఆర్ బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనపై పొంగులేటి స్పందిస్తూ కేటీఆర్ పై విమర్శలు గుప్పించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గెలవడం మీ నాన్న తరం కాలేదు... నీ వల్ల ఏమవుతుందని అని అన్నారు. ముందు మీ ఇంట్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రభుత్వాన్ని తరువాయి 2 వ పేజీలో...



# దోపిడీ దొంగ కేసీఆర్

### పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతుంటే నోరు మెదపలేదు

### బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పై తీవ్ర విమర్శలు చేశారు కేంద్ర మంత్రి బండి సంజయ్. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు సామర్థ్యం పెంచుతుంటే కేసీఆర్ నోరు మెదపలేదని అన్నారు. తెలంగాణ వచ్చాక పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 4.3 టీఎంసీల నుండి ఏకంగా 13.7 టీఎంసీలకు పెంచినా నోరు మెదపని సన్నాసి కేసీఆర్ అని అన్నారు. ప్రజలను డైవర్ట్ చేసేందుకే కాళేశ్వరం పేరుతో కూలేశ్వరం ప్రాజెక్టును కట్టారన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో భారీ దోపిడీ కి స్కెచ్ వేశాడని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోక పోవడంవల్ల క్రిష్ణా -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

9.1.2026

మేషం: కుటుంబ సభ్యుల నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. చిన్ననాటి మిత్రులతో గృహమును సంతోషంగా గడుపుతారు. వృత్తి ఉద్యోగాల్లో అధికారుల ఆదరణ పొందుతారు. వాహన సంబంధిత వ్యాపారాలు రాణిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఉత్సాహంగా సాగుతాయి.

వృషభం: సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. శుభకార్యలకు ధన వ్యయం చేస్తారు. కుటుంబ సభ్యులతో గృహమున సంతోషంగా గడుపుతారు. వృత్తి ఉద్యోగాల్లో అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నుంచి ఉపసమనం పొందుతారు.

మిధునం: సంతానం విద్యా ఉద్యోగ విషయాలలో దృష్టి సారించడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు తప్పవు. కీలక వ్యవహారాలలో బద్దకించడం మంచిది కాదు. కుటుంబమున కొందరి ప్రవర్తన మానసికంగా బాధిస్తుంది.

కర్కాటకం: చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో నిదానంగా వ్యవహారించాలి. ఉద్యోగస్తులకు శ్రమాధిక్యత పెరుగుతుంది. దైవ చింతన పెరుగుతుంది. మాతృ వర్గ బంధువులతో మాటపట్టింపులుంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

సింహం: సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. దైవ కార్యక్రమాలలో ఆసక్తి పెరుగుతుంది. ఆదాయం మార్గాలు ఆశించిన విధంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు ఉన్నత అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

కన్య: చేపట్టిన పనులు కొంత మందకొడిగా సాగుతాయి. సోదరులతో కొన్ని విషయాలలో మాటపట్టింపులు ఉంటాయి. ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి. వ్యాపారస్తులకు నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు పెరుగుతాయి.

తుల: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. గృహంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు సమాకూరుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ విలువ పెరుగుతుంది. చిన్ననాటి మిత్రుల నుండి ధన సహాయం అందుతుంది. స్ధిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు.

వృశ్చికం: వృధా ఖర్చులు పెరుగుతాయి.దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. ఉద్యోగమున ఇతరుల ప్రవర్తన వలన ఇబ్బందులు తప్పవు.

ధనస్సు: ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. ధన వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాల్లో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటా బయట వివాదాలు పరిష్కరించుకుంటారు.

మకరం: నూతన వాహనం కొనుగోలు చేస్తారు వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. సంఘంలో పెద్దలతో సఖ్యతగా వ్యవహరించి ప్రశంసలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. అన్ని వైపుల నుండి ఆదాయం అందుతుంది.

కుంభం: ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు పెరుగుతాయి. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో వ్యయ ప్రయాసలతో కానీ పనులు పూర్తి కావు. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది.


మీనం: గృహ నిర్మాణ పనులలో అవరోధాలుంటాయి. వాహన ప్రయాణ విషయంలో జాగ్రత్త వహించాలి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. నూతన రుణాలు చేయడం మంచిది కాదు. వ్యాపారస్థులకు గందరగోళ పరిస్థితులుంటాయి.



# మార్కెట్ అబ్బ!

**మొదటి పేజీ తరువాయి**

చూపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో టోటల్ గా భారత స్టాక్ మార్కెట్ కుప్ప కూలిపోయింది. సెన్సెక్స్ 780 పాయింట్లు పడిపోయి 84,181 వద్ద క్లోజ్ అవ్వగా, నిఫ్టీ కూడా 264 పాయింట్లు పడిపోయి 25,877 వద్ద ముగిసింది. గురువారం మార్కెట్ మొదలవ్వడమే నష్టాలతో ప్రారంభం అయింది. సెన్సెక్స్ ఉదయం 84,778.02లతో నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అమ్మకాల ఒత్తిడితోనే కొనసాగింది. మొదటి కొన్ని గంటల్లో మార్కెట్ కోలుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, చివర్లో చమురు, బ్యాంకింగ్ స్టాక్ లలో అమ్మకాలు విపరీతంగా జరగడంతో మార్కెట్ తీవ్రంగా నష్టపోయింది. ఇంట్రాడేలో 84,110.10 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 780.18 పాయింట్ల నష్టంతో 84,180.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 263.90 పాయింట్ల నష్టంతో 25,876.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. దీంతో స్టాక్ మార్కెట్లో 8 లక్షల కోట్లు ఆవిరి అయిపోయాయి. బీఎస్ఈ-లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.7 లక్షల కోట్లకు పైగా తగ్గి, రూ.479 లక్షల కోట్ల నుండి రూ.472 లక్షల కోట్లకు పడిపోయింది. అయితే మార్కెట్ క్షణత మధ్య, కొన్ని స్టాక్‌లు పెట్టుబడిదారులకు కొంత ఉపశమనం కలిగించాయి. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ఇటీవల పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లను తగ్గించిన తర్వాత 2% లాభపడి ముగిసింది. బాలాజీ అమైన్స్ షేర్లు 14% పెరిగాయి. డెంగ్యూ వ్యాక్సిన్ తాలూకా క్లినికల్ ట్రయల్స్‌ను కంపెనీ పూర్తి చేసిన తర్వాత పనాసియా బయోటెక్ కూడా 13% పెరిగింది. ప్రపంచ మార్కెట్లో వస్తువుల ధరలు తగ్గడం వల్ల హిందుస్తాన్ జింక్, జిందాల్ స్టీల్ వంటి మెటల్ స్టాక్స్ 7% వరకు పడిపోయాయి. మరోవైపు ప్రపంచ మార్కెట్లు కూడా పెద్దగా ముందుకు వెళ్ళలేదు. అక్కడ కూడా మిశ్రమ సంకేతాలు కనిపించాయి. ఆసియా మార్కెట్లలో.. కొరియా కోస్పి 0.029% పెరిగి 4,552 వద్ద, జపాన్ నిక్కీ ఇండెక్స్ 1.63% తగ్గి 51,117 వద్ద ముగిశాయి.హాంకాంగ్‌కు చెందిన హాంగ్ సెంగ్ ఇండెక్స్ 1.17% తగ్గి 26,149 వద్ద ముగిసింది. చైనాకు చెందిన షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 0.068% తగ్గి 4,082 వద్దకు చేరుకుంది. జనవరి 7న, ఖా డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 0.94% తగ్గి 48,996 వద్ద ముగిసింది. నాస్డాక్ కాంపోజిట్ ఇండెక్స్ 0.16% పెరిగింది. ఎస్ అండ్ పీ 500 0.34% పడిపోయింది.



# ట్రంప్ దెబ్బ..!

**మొదటి పేజీ తరువాయి**

కొంటున్న దేశాల్లో ప్రస్తుతం చైనా మొదటి స్థానంలోనూ, భారత్ రెండో స్థానంలోనూ ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనడాన్ని ఆపించడానికి ట్రంప్ ఎన్నో ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగానే భారత ఉత్పత్తులపై 50 శాతం సంకాలు విధించారు. అయినా భారత్ మాత్రం రష్యా నుంచి చవకగా వస్తున్న చమురును కొనుగోలు చేస్తూనే ఉంది.

# నలుగురి బలి కోరిన వేగం

**మొదటి పేజీ తరువాయి**

అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో విద్యార్థుల కుటుంబాల్లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# కావాలంటే పిల్లుల్ని పెంచుకోండి

**మొదటి పేజీ తరువాయి**

మెహతా కీలక వ్యాఖ్యలు చేశారు. కుక్కలను పెంచుకునే కంటే పిల్లులను పెంచుకోవాల న్నారు. ఎలుకల నియంత్రణలో పిల్లులు కీలక ఎ పాత్ర పోషిస్తాయని సూచించారు. కాబట్టి కుక్కలకంటే పిల్లులను పెంచేందుకు ప్రోత్స హించాలన్నారు. సీనియర్ అడ్వొకేట్ సీయూ సింగ్ వాదనల సందర్భంగా కుక్కలు లేకపోతే ఎలుకలు, కోతుల సమస్య పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ మెహతా.. 'కుక్కలు, పిల్లులు పరస్పరం శత్రువులు.. పిల్లులు, ఎలుకలు బద్ధ శత్రువులు.. వీధుల్లో కుక్కల సంఖ్య తగ్గితే పిల్లుల సంఖ్యపెరుగుతుంది.. అప్పుడు అవి ఎలుకలను తింటాయి కదా' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. వీధి కుక్కల నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్ నియమాలే సరైన మార్గమని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. భారీ సంఖ్యలో కుక్కలను షెల్టర్లలో ఉంచితే వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముందని హెచ్చరించారు. అయితే ఈ కేసులో తదుపరి వాదనలు శుక్రవారం కూడా కొనసాగనున్నాయి.



# పట్నంలో ఓట్ల జాతర

**మొదటి పేజీ తరువాయి**

మున్సిపాలిటీలు 9 గ్రేటర్ కార్పొరేషన్లు ఉండగా వీటిలో గ్రేటర్ హైదరాబాద్(జీహెచ్ఎంసీ) పాలకవర్గం గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగుస్తుంది. వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు సిద్దిపేట, జడ్చర్ల, కొత్తూర్, అచ్చంపేట, నకిరేకల్ మున్సిపాలిటీల పాలవర్గాల గడువు వచ్చే ఏడాది మే వరకు ఉన్నది. ఇవి కాక మందమర్రి, మణుగూరు మున్సిపాలిటీలు షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్నవి. ఈ పది చోట్ల మినహా ఇంకా మిగిలిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు ఈ ఏడాది జనవరిలోనే ముగిసింది. ప్రస్తుతం ఇక్కడ స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతున్నది. ఇప్పటికే 117 మున్సిపాలిటీల పరిధిలో 2,630, ఆరు కార్పొరేషన్ల పరిధిలో 366 వార్డులను ఎలక్షన్ కమిషన్ ఫైనల్ చేసింది. అన్ని చోట్ల కలిపి 52.71 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లుగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి, అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు.

# మున్సిపాలిటీలకు తలో 10 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

చేసింది. ప్రస్తుతం విడుదల చేసిన నిధులను మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయడానికి, అత్యవసర మరమ్మతులు, మురుగునీటి కాలవల శుభ్రత, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల మరమ్మతులకు ఉపయోగించడానికి మంజూరు చేసినట్లుగా తెలుస్తోంది. స్థానిక సంస్థల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసేందుకు రాష్ట్ర వాటా నిధులను ప్రభుత్వం నేరుగా మున్సిపాలిటీలకు మళ్లిస్తోందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

# దోపిడీ దొంగ కేసీఆర్

**మొదటి పేజీ తరువాయి**

నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందంటూ కేంద్రం అనేకసార్లు హెచ్చరించిందని అన్నారు. ఎన్నిసార్లు నిలదీసినా మమ్ముల్ని పిట్టకథలు చెబుతూ కేసీఆర్ హేళన చేశారన్నారు. నీళ్ల విషయంలో పాలకుల తప్పిదాలను సరిదిద్దేందుకు కేంద్రం అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ లను ఏర్పాటు చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం పేరుతో కూలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి దోపిడీకి స్కెచ్ వేసింది కేసీఆర్ అని బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ వేల కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. రూ.30వేల కోట్ల ప్రాజెక్టును లక్ష కోట్లకు పెంచి దోచుకున్న దోపిడీ దొంగ కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ పాలనలో ఏపీలో అక్రమ ప్రాజెక్టులకు పునాది పడిందన్నారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా సంగమేశ్వర ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పై పత్రికల్లో, టీవీల్లో పెద్ద ఎత్తున వార్తలు వచ్చినా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. ఒప్పందానికి మించి 38 టీఎంసీల నీళ్లను ఏపీ ప్రభుత్వం అదనంగా వాడుకుందని మొత్తుకున్నా కేసీఆర్ ఫాంహౌజ్ కే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. అప్పటి ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డితో ప్రగతి భవన్ లో మీటింగ్ పెట్టుకుని 'బేసిన్లు లేవ్... బేషజాల్లేవ్ల అని మాట్లాడింది నిజం కాదా? అని ప్రశ్నించారు. నాటి మంత్రి రోజా గులాబీ రేకులతో స్వాగతం పలికితే వెళ్లి రొయ్యల పులుసు తిని రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని కేసీఆర్ చెప్పింది నిజం కాదా..నీళ్ల విషయంలో కేసీఆర్ తెలంగాణ విలన్ గా మారారని ఆరోపించారు.

# దమ్ముంటే ఖమ్మంలో పోటీ చెయ్

**మొదటి పేజీ తరువాయి**

పడగొట్టేందుకు ప్రయత్నించారని పొంగులేటి మండిపడ్డారు. ప్రభుత్వం జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ పవర్ ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కేటీఆర్ మతి భ్రమించి రాహుల్ గాంధీ, గాంధీ కుటుంబంపై మాట్లాడుతున్నారని, సూర్యుడి పైకి ఉమ్మితే అది తిరిగి తన ముఖం మీదే పడుతుందని గమనించాలని అన్నారు. అవినీతి, దోపిడీలకు పేటెంట్‌గా ఉన్న కల్వకుంట్ల ఫ్యామిలీ గాంధీ కుటుంబం గురించి మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. జాతీయ నాయకుడిని విమర్శిస్తే తాను కూడా జాతీయ నాయకుడినవుతానని తాపత్రయపడటంలో తప్పులేదు కానీ ఆశకు హద్దు ఉండాలని అన్నారు. ఎన్నికల్లో వరుసగా దెబ్బలు తిన్నా బుద్ధి తెచ్చుకోకుండా అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు రెఫరెండం అని చెప్పిన ఎన్నికల్లోనే ప్రజలు గూబ గుయ్యిమనిపించారు. జూబ్లీహిల్స్, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. ఇప్పుడు రాబోయే మున్సిపల్ ఎన్నికలను సెమీ ఫైనల్స్ అంటున్నారు... దేనికి సెమీ ఫైనల్?' అంటూ ప్రశ్నించారు.


# తెలంగాణకు టీఈపీ

**మొదటి పేజీ తరువాయి**

పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లడానికి రవాణా సౌకర్యం కల్పించే ఆలోచన కూడా చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దుతున్న వివరాలను, అలాగే ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకేచోట మినీ యూనివర్సిటీ స్థాయిలో ఈ స్కూల్స్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఏటీసీగా మార్చిన మల్లేపల్లి (ఐటీఐ)ని సందర్శించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్.. హిమాచల్‌ప్రదేశ్ మంత్రికి సూచించారు. రాష్ట్రంలో నెలకొల్పుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపైన ఆసక్తి చూపించిన హిమాచల్ ప్రదేశ్ మంత్రి అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను అందించాలని కోరారు.

### యంగ్ ఇండియా స్కూళ్లలో బాలికలకు ప్రాధాన్యం

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆర్ఎస్) మొదటి విడతలో పూర్తయ్యే వాటిలో బాలికలకు ఎక్కువ స్కూల్స్ కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రతి నియోజకవర్గంలోనూ బాలురు, బాలికలకు ఒక్కొక్కటి చొప్పున వైఐఐఆర్ఎస్‌ల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనన్నారు. ప్రస్తుతం బాలికలకు స్కూల్స్ కేటాయించిన నియోజకవర్గంలో మరో విడతలో బాలురకు కేటాయించాలన్నారు. విద్యా శాఖపై రాష్ట్ర సచివాలయంలో గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. వైఐఐఆర్‌సీలో సోలార్ కిచెన్ల నిర్మాణాన్ని పీఎం కుసుమ్‌లో చేపట్టే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. వైఐఐఆర్ఎస్‌ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల్లలో స్వచ్ఛంద సంస్థల ద్వారా అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని తెలంగాణవ్యాప్తంగా అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. తగినంత స్థలం, అవసరమైన మద్దతు అందజేస్తే పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయగలమని అక్షయపాత్ర ప్రతినిధులు సీఎంకు తెలియజేశారు. ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి అందరికీ సకాలంలో భోజనం అందేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఎల్.వి.ఎస్.ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



### బల్దియాలపై మూడు రంగుల జెండా

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్త చాటుదామని, బల్దియాల్లో పట్టు సాధించి తీరుదామని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం గాంధీ భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి చూపించామని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను బొంద పెట్టి గుండు సున్నకు తీసుకువెళ్లామని అన్నారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ను ఓడించామని చెప్పారు. పంచాయతీల్లో మనం పూర్తి స్థాయిలో పట్టు సాధించామని అన్నారు. రాష్ట్రంలో రాబోయే మరో 8 ఏళ్లు మనమే అధికారంలో ఉండబోతున్నామని అందువల్ల స్థానిక సంస్థలలో మన పట్టు ఉంటేనే అభివృద్ధి చేస్తామన్నారు.రెండేండ్లలో ఒక్క ఎమ్మెల్యే రాలేదు తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యే కూడా తన వద్దకు ప్రజా సమస్యల కోసం రాలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వాళ్లకు రాజకీయ పదవులు కావాలే తప్ప ప్రజా సమస్యలపై పట్టింపు లేదని విమర్శించారు.



# నిరుద్యోగుల అరెస్టు అప్రజాస్వామికం

**అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అడ్డగోలు హామీలు**

**వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి: కవిత**

హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయాలంటూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను అరెస్టు చేయడం దారుణమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, నిరుద్యోగుల అరెస్టు అప్రజాస్వామికమని అన్నారు. అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ హామీలు గుప్పించిందని విమర్శించారు. ప్రస్తుతం జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే వారిని అరెస్టు చేయడం దుర్మార్గమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటివరకు 20 వేలకు మించి ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, దానికి అనుగుణంగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని ఆమె కోరారు. కాగా, అశోక్ నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. వెంటనే జాబ్ క్యాలెండర్‌ను, నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గ్రంథలయం నుంచి అశోక్ నగర్ చౌరస్తాకు ర్యాలీగా వచ్చారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



# ఖాళీ అవుతున్న హైదరాబాద్

**సంక్రాంతి సెలవులకు సొంతూళ్లకు జనాలు.. జనసంద్రంగా రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు**

హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): తెలంగాణలో పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో హైదరాబాద్ లో నివసిస్తున్న కుటుంబాలు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు పయనమవుతున్నాయి. ఉదయం నుంచే సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లకు ప్రయాణికులు పోటెత్తారు. సికింద్రాబాద్ స్టేషన్ అయితే పూర్తిగా రద్దీతో నిండిపోయింది. లగేజీలు, పిల్లలు, పెద్దలతో జనసంద్రం కనిపించింది. ఈ రద్దీని ముందుగానే అంచనా వేసిన దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే 150 స్పెషల్ ట్రైన్లను అనౌన్స్ చేసింది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, తిరుపతి వంటి ఏపీ ప్రాంతాలకు డిమాండ్ ఆకాశాన్నంటడంతో అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు.

సికింద్రాబాద్ స్టేషన్ పై ఒత్తిడి తగ్గించేందుకు... జనవరి 7 నుంచి 20 వరకు 27 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హైటెక్ సిటీ, చర్లపల్లి స్టేషన్లలో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. దీనివల్ల ఐటీ కారిడార్‌లో ఉండే ఉద్యోగులు సికింద్రాబాద్ రాకుండా నేరుగా హైటెక్ సిటీలోనే రైలు ఎక్కే సౌకర్యం లభిస్తుంది, ఇది చాలా మందికి భారీ రిలీఫ్‌గా మారింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా ప్లాట్‌ఫామ్ 10 వైపు పార్కింగ్, ఎగ్జిట్ మార్గాలు మార్చారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా అదనపు సిబ్బంది, పోలీసు బలగాలను మోహరించారు. ఇక అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు తీసుకునేవాళ్లు 'రైల్ వన్' యాప్ ద్వారా టికెట్ బుక్ చేసుకుంటే 3 శాతం డిస్కౌంట్ లభిస్తుందని రైల్వే అధికారులు చెప్పారు.



# వీకే సింగ్ ఇంటిపై దాడికి యత్నం

**జూబ్లీహిల్స్‌లోని నివాసం వద్ద దుండగుడి హల్ చల్**

హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): మాజీ ఐపీఎస్ అధికారి వీకే సింగ్ ఇంటి వద్ద ఒక దుండగుడు హల్ చేశాడు. హైదరాబాద్ లోని ఆయన నివాసంపై దాడికి యత్నించాడు. బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది నుంచి వెపన్ లాక్కునే ప్రయత్నం చేశాడు. వెంటనే అప్రమత్తమైన ఇతర సెక్యూరిటీ సిబ్బంది నిందితుడిని పట్టుకున్నారు. దీనిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని తర్ఫీజ్ గా గుర్తించారు.

# అమృత బాబాయ్‌కు బెయిల్

**రూ.25 వేల పూచీకత్తుపై షరతులతో మంజూరు**



హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ ప్రణయ్ పరువు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న నిందితుడు శ్రవణ్‌కుమార్‌కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు అదే మొత్తానికి రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. బెయిల్‌పై ఉన్న సమయంలో ఎలాంటి నేరాలకు పాల్పడరాదని స్పష్టం చేసింది. 2025 మార్చిలో నల్గొండ జిల్లా కోర్టు ఈ కేసులో శ్రవణ్‌కుమార్‌కు జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ శ్రవణ్ హైకోర్టును ఆశ్రయించారు. తన అప్పీల్ విచారణ పూర్తయ్యే వరకు బెయిల్ మంజూరు చేయాలని మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం, నిందితుడి వయసు, జైలు జీవితాన్ని పరిగణనలోకి తీసుకుని బెయిల్‌కు అనుమతించింది. 2018 సెప్టెంబర్ 14న మిర్యాలగూడలో పెరుమాళ్ల ప్రణయ్‌ను ఆయన మామ మారుతీరావు సుపారీ గ్యాంగ్‌తో దారుణంగా హత్య చేయించారు. తన కుమార్తె అమృత, ప్రణయ్‌ను కులాంతర వివాహం చేసుకోవడమే ఇందుకు కారణం. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో సుదీర్ఘ విచారణ జరిపిన నల్గొండ కోర్టు, ప్రణయ్‌ను హత్య చేసిన సుభాశ్ శర్మకు (ఏ-2) ఉరిశిక్ష, రూ. 15వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. అలాగే, అమృత బాబాయి అయిన శ్రవణ్‌కుమార్‌తో పాటు మిగిలిన నిందితులకు జీవిత ఖైదు, రూ. 10వేల జరిమానాను ఖరారు. ఇప్పుడు శ్రవణ్‌కు బెయిల్ లభించడం చర్చనీయాంశంగా మారింది.

# నిరుద్యోగులకు గిఫ్ట్‌గా సంకెళ్లా?

**సర్కారుపై హరీశ్ రావు మండిపాటు**



హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రేవంత్ సర్కారు సాగిస్తున్న దమన కాండపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్, నేడు అశోక్ నగర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులు క్రూరంగా విరుచుకుపడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు అశోక్ నగర్ లైబ్రరీ చుట్టూ చక్కర్లు కొట్టి పొర్లుదండాలు పెట్టి నిరుద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారు. వారి ఉద్యోగ కాంక్షను ఆసరా చేసుకొని, వారిని కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చుకొని ఇంటింటికి తిప్పి ప్రచారానికి వాడుకుని.. అధికార పీఠం ఎక్కగానే అదే నిరుద్యోగ గొంతులపై ఉక్కు పాదం మోపి తొక్కుతున్నారని ఆరోపించారు. ఇవాళ తెలంగాణలో నిరంకుశత్వం రాజ్యమేలుతున్నది. పోలీసు రాజ్యం నడుస్తున్నది. ఓడ దాటే దాకా ఓడ మల్లన్న, ఓడ దాటినాక బోడ మల్లన్న అన్నట్లు ఇప్పుడు నిరుద్యోగులకు లాఠీ చార్జీలు, అరెస్టులు, సంకెళ్లను బహుమతిగా ఇస్తున్నారని హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేశారని మండిపడ్డారు. రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నవు..నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నవు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవని సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రంథలయాల్లో పోలీసులు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. గాయపడిన ప్రతి నిరుద్యోగికి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పి తీరాలి. దాడికి బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# రేవంత్.. 2 లక్షల ఉద్యోగాలేవి?: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో శేరిలింగపల్లి నియోకవర్గానికి చెందిన పలువురు నాయకులు వివిధ పార్టీల నుంచి వచ్చి బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి స్వయంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కారు ప్రజలను మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ రేవంత్ సర్కారు నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడి పోయినయని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి ఇయ్యకుండా నిరుద్యోగులను మోసం చేసిండ్రని ఆరోపించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు విద్యార్థులు రోడ్లపైకి వస్తున్నారని కేటీఆర్ చెప్పారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్‌లో, ఇవాళ అశోక్‌నగర్‌లో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని అన్నారు.

# 15 వేలు లంచంతో పట్టుబడ్డ ఎస్సై

వరంగల్, జనవరి 8 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు (ఇాజదీ ) పట్టుబడుతున్నారు. గురువారం వరంగల్ కేయూసీ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీకాంత్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇటీవల ఒక కేసులో పట్టుబడ్డ వ్యక్తి తనపై వెంటనే చార్జ్‌షీట్ నమోదు చేసి పట్టుకున్న వాహనాన్ని, మొబైల్ ఫోన్‌ను తనకు అప్పగించాలని ప్రైవేట్ డ్రైవర్ ద్వారా ఎస్సైను సంప్రదించాడు. దీంతో లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం కేయూ జంక్షన్ వద్ద రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి ప్రైవేట్ డ్రైవర్‌ను, ఎస్సైను పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచారు.

# ప్రశ్నపత్రాల లీకేజీ.. 35 మంది ప్రవేశాలు రద్దు

హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో ప్రశ్నపత్రాల లీకేజీ కలకలం రేపింది. సెమిస్టర్ ప్రశ్నపత్రాలను లీక్ చేసిన వ్యవహారంలో నలుగురు సిబ్బందిపై వేటు వేశారు యూనివర్సిటీ అధికారులు. అంతేకాదు 35 మంది ఇన్ సర్వీస్ బీఎస్సీ అగ్రికల్చర్ అభ్యర్థుల ప్రవేశాలను సైతం రద్దు చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీపై సమగ్ర విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో సెమిస్టర్ ప్రశ్నపత్రాలు లీవ్ అవుతున్నట్టు జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ అధికారులు గమనించారు.

# రాహుల్ ముద్దపప్పు అన్నది రేవంతేగా!

**నేనూ అదే అన్నా.. తప్పేముంది: కేటీఆర్**



హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమని సంబోధించారో, తాను అదే వ్యాఖ్య చేశానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 'పప్పు' కాదని, 'ముద్దపప్పు' అని రేవంత్ రెడ్డి గతంలో అన్నారని, ఇప్పుడు తాను కూడా అదే పదం ఉపయోగించానని ఆయన స్పష్టం చేశారు. 'రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అసభ్యకర పదాలు మాట్లాడితే కోపం వచ్చి, నేను కూడా రాహుల్ గాంధీని ఒక మాట అన్నాను. నా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారు. కానీ, నేను కొత్తగా ఏమీ అనలేదు. రేవంత్ రెడ్డి అన్న మాటనే నేను అన్నాను. మీ రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీని పప్పు కాదు ముద్దపప్పు అని అన్నారు. కాబట్టి ఆ విమర్శలు ఏమైనా ఉంటే రేవంత్ రెడ్డిపై చేయండి. మీ సోనియా గాంధీని మీ రేవంత్ రెడ్డి 'బలిదేవత' అన్నారు. అలాంటి వ్యక్తిని తీసుకువచ్చి మీరు ముఖ్యమంత్రిగా చేశారు. తనను ముఖ్యమంత్రిగా చేసిన రాహుల్ గాంధీని 'ముద్దపప్పు' అని అన్నది రేవంత్ రెడ్డే అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ దద్దమ్మ కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు కుస్తీలు పట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం కూడా భారీ క్యూలైన్‌లలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి క్రాప్ హాలిడేలు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో యూరియా కోసం కుస్తీలు లేవని, విత్తనాల కోసం పోటీ లేదని, కరెంటు కష్టాలు లేవని, క్రాప్ హాలిడేలు లేవని ఆయన వెల్లడించారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం 10 శాతం పనులు పూర్తి చేస్తే వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నా ఈ ప్రభుత్వం ఆ పని చేయడం లేదని విమర్శించారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, తన బాస్‌కు కోపం వస్తుందనే భయంతో రేవంత్ రెడ్డి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆయన అన్నారు.

# కేసీఆర్ అరెస్టుకు కుట్ర



హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేసి జైలులో పెట్టేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ కు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం చూస్తోందని పేర్కొన్నారు. ఉత్తమ ఇంటెలిజెన్స్ అధికారిగా గుర్తింపు పొందిన విశ్రాంత ఐపీఎస్ ప్రభాకర్ రావును ఏ1 గా చేశారని,చట్టబద్ధంగా విధులు నిర్వర్తించడం ఆయన చేసిన పాపమా? అని ప్రశ్నించారు. కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు పేర్లు చెప్పాలని ప్రభాకర్‌రావుపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో పాటు చాలా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.తెలుగు సీరియల్స్ లాగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు.మొదట ఏర్పాటు చేసిన సిట్‌లో 350 మంది సాక్షులను విచారణ చేసినా ఏమీ తేలక పోవడంతోమళ్లీ నలుగురు సీనియర్ ఐపీఎస్ లతో సిట్ ఏర్పాటు చేసి మళ్లీ విచారణను సాగదీస్తున్నారని దుయ్యబట్టారు. పురాతనకాలం నుంచి వేగుల వ్యవస్థ, 18 వ దశకం నుంచే ఫోన్ ఎలా ట్యాప్ చేయవచ్చో చట్టం తీసుకోచ్చారని గుర్తు చేశారు.మంత్రుల ఫోన్లను ముఖ్యమంత్రి ట్యాపింగ్ చేయడం లేదా? ప్రభాకర్ రావును ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రతీకారేచ్ఛాతో రగిలిపోతున్నారని తెలిపారు. సీఎం మెప్పు కోసం అడ్డదారులు తొక్కడం మంచిది కాదని సూచించారు. సీనియర్ ఐపీఎస్ ను వేధించడం సబబు కాదని,ఇంత జరుగుతున్నా ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల సంఘాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఈ కేసులో నాటి సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్ లను ఎందుకు నిందితులుగా చేర్చలేదని అన్నారు. బీఆర్ఎస్ నాయకులపై కుట్రలు చేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారిని మంత్రి వేధిస్తున్నారని మీడియాలో కథనాలు వస్తున్నాయని ,మంత్రులు అసభ్యకర రీతిలో వేధించే స్థాయికి పరిపాలన దిగజారిందని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కె.కిషోర్ గౌడ్, కె.వాసు దేవ రెడ్డి, తుంగ బాలు, మొహిసిన్ పాల్గొన్నారు.

# ప్రియుడు అనుమానించాడని! వాటర్ ట్యాంకు పైనుంచి దూకి యువతి ఆత్మహత్య

నాగోల్/హైదరాబాద్, జనవరి 8 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని నాగోల్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. ప్రేమించిన యువకుడు అనుమానించాడనే మనస్తాపంతో ఓ యువతి వాటర్ ట్యాంక్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందగా, ఘటనకు కారణమైన ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన ఐశ్వర్య (19) తన అన్నతో కలిసి నాగోలు సమీపంలోని తట్టిఅన్నారం వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తోంది. ఆమె దూరపు బంధువైన మహేష్ అలియాస్ ఆనంద్ (23) హస్తినాపురంలో ఉంటూ ఆటో నడుపుతున్నాడు. ఏడాది క్రితం ఓ పూజలో పరిచయమైన వీరిద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోగా, మొదట నిరాకరించిన పెద్దలు తర్వాత అంగీకరించారు. అయితే, ఐశ్వర్య తరచూ ఫోన్‌లో వేరొకరితో మాట్లాడుతోందని ఆనంద్ అనుమానం పెంచుకున్నాడు. ఈ నెల 5న ఇద్దరూ హౌసింగ్ బోర్డు కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫోన్ కాల్స్ విషయంపై ఆనంద్ ఆమెను నిలదీయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఐశ్వర్య, ట్యాంక్ పైనుంచి కిందకు దూకేసింది. తీవ్ర గాయాలైన ఆమెను నాగోల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. తమ కుమార్తె మృతికి ఆనందే కారణమని ఐశ్వర్య కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు మహేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.





## పిఠాపురంలో పవన్ సంక్రాంతి

**మూడు రోజుల పాటు అక్కడే..**

**పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

పిఠాపురం, జనవరి 8 (ఈవార్తలు): ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన సొంత నియోజకవర్గంలో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఆయన పిఠాపురంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు, 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' పేరుతో ముందస్తు సంక్రాంతి సంబరాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. పర్యటన వివరాల ప్రకారం, గురువారం రాత్రికి పిఠాపురం చేరుకోనున్న పవన్ కల్యాణ్, శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. కళాశాల మైదానంలో జరగనున్న సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 11:30 గంటలకు నియోజకవర్గంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఆ తర్వాత మహోత్సవ ప్రాంగణంలోని సాంస్కృతిక కార్యక్రమాలను, ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకిస్తారు. సాయంత్రం, ఇటీవల వర్షాలకు ముంపునకు గురైన పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ, రైల్వే స్టేషన్ సమీపంలోని మోహన్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి, స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఇక తన పర్యటనలో రెండో రోజైన శనివారం ఉదయం, గొల్లప్రోలు మండలంలో పేదల కోసం కేటాయించిన ఇళ్ల స్థలాలను పరిశీలిస్తారు. అక్కడి నుంచి ఉదయం 10:30 గంటలకు కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుంటారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితిపై పోలీసు ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న ఈ సంక్రాంతి మహోత్సవాలను రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. మొదటి రోజు (జనవరి 9) హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, జానపద గీతాలు, వీర నాట్యాలు, తప్పెట గుళ్లు, గరగల నృత్యాలు, థింసా, లంబాడీ వంటి గిరిజన, సంప్రదాయ నృత్యాలతో పాటు కూచిపూడి, భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించనున్నాయి. రెండో రోజు (జనవరి 10)... తొలి రోజు ప్రదర్శనల కొనసాగింపుతో పాటు కేరళకు చెందిన సంప్రదాయ యుద్ధ కళల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇక చివరి రోజు (జనవరి 11) గ్రామీణ జానపద కళాకారుల పాటలు, సినీ మ్యూజికల్ నైట్‌తో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.

## రాయలసీమకు చంద్ర గ్రహణం: జగన్



తాడేపల్లి, జనవరి 8 (ఈవార్తలు): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విరుచుకు పడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరిగి తాము అధికారంలోకి రాకపోవడం సీమ ప్రజల దురదృష్టమని అన్నారు. రాయలసీమ లిఫ్ట్‌ను ఆపించామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చెప్పారని తెలిపారు. చంద్రబాబు రేవంత్‌తో చేసుకున్న లోపాయికారి ఒప్పందం కారణంగానే రాయలసీమకు మరోసారి అన్యాయం జరుగుతుందని, రాయలసీమకు చంద్రగ్రహణం పట్టిందని విమర్శించారు. చంద్రబాబు స్వార్ధ రాజకీయాల కోసం ప్రజల్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్‌పై వాస్తవాలు ప్రజలకు తెలియవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ అవసరం లేదని మాట్లాడడం సీమకు ద్రోహం చేసినట్టేనని దుయ్యబట్టారు . వైసీపీ హయాంలో శ్రీశైలం నీటిని 500 కిలోమీటర్లు తీసుకెళ్లి కుప్పంకు ఇచ్చామని వెల్లడించారు. సీమ ప్రాజెక్టులకు పూర్తిగగా నీళ్లు నింపుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక కెనాళ్ల సామర్థ్యాన్ని పెంచి గండికోటలో నీళ్లు నిలువ చేశామని వివరించారు. పులిచింతలలో 45 టీఎంసీలు, బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీలు , సోమశిలలో 78, కండలేరలో 68 టీఎంసీల నీటిని నిల్వ చేశామని వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత తమదేనని అన్నారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేయాలని తాము కోరుకోవడం లేదని స్పష్టం చేశారు.

## రక్తాభిషేకం చేసిన వైసీపీ కార్యకర్తలతో జగన్ భేటీ

తాడేపల్లి, జనవరి 8 (ఈవార్తలు): గత నెల వైసీపీ అధినేత జగన్ పుట్టినరోజు సందర్భంగా గోపాలపురం నియోజకవర్గం తూర్పు చోడవరం గ్రామంలో వైసీపీ కార్యకర్తలు జగన్ ఫ్లెక్సీ ముందు పొట్టేలు బలి ఇచ్చారు. ఆ రక్తంతో ఫ్లెక్సీకి అభిషేకం చేసి, రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో ప్రజల్లో భయాందోళనలు రేగాయి. పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. నల్లజర్ల పోలీసులు ఏడుగురు కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. జంతు హింస చట్టం కింద, ప్రజల్లో భయం కలిగించినందుకు, బహిరంగ ప్రదేశంలో అలాంటి చర్యలు తీసుకున్నందుకు కేసు నమోదు చేశారు. వీరిని అరెస్ట్ చేసి రోడ్డు మీదుగా నడిపిస్తూ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలపై 16 కేసులు, 63 మంది అరెస్టులు జరిగాయి. పొట్టేలు బలి ఇచ్చిన వైసీపీ కార్యకర్తలతో తాజాగా జగన్ భేటీ అయ్యారు. గోపాలపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ హోంమంత్రి తానేటి వనిత వారిని తీసుకొచ్చారు. కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి రోడ్డుపై నడిపించిన తీరును వారు జగన్‌కు వివరించారు. ధైర్యంగా ఉండమని, భయపడవద్దని జగన్ వారికి చెప్పారు. కేసులపై పార్టీ న్యాయ విభాగం సహాయం చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ దన్నుతో పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దిగజారుడుగా వ్యవహరిస్తున్నారని జగన్ ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ప్రకటన కూడా జారీ చేసింది.

## బెర్లిన్‌లో కరెంటు కటకట

బెర్లిన్: జర్మనీ రాజధాని బెర్లిన్ రెండు రోజులుగా చీకట్లోనే మగ్గుతోంది. తీవ్ర బ్లాకౌట్ కారణంగా 2 రోజులుగా కరెంటు లేక అల్లాడుతోంది. విద్యుత్ సరఫరా చేసే కేబుళ్లను కొందరు కావాలనే కట్ చేయడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు అనుమానిస్తున్నారు. పవర్ కట్ కారణంగా 45,000 ఇండ్లు, 1,120 సంస్థలు చీకట్లోనే ఉన్నాయి. అసలే శీతాకాలం, ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్న తరుణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది.







# టూరిజమే గేమ్ ఛేంజర్

## కృష్ణా నది ఒడ్డున మెరీనా ప్రాజెక్టు.. 19,391 కోట్ల విలువైన పెట్టుబడులు

**11,753 కొత్త ఉద్యోగాల కల్పన**

**లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు**

**ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు**

అమరావతి, జనవరి 8 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు వేదికైంది. అమరావతిలోని కృష్ణా నది తీరంలో ప్రతిష్ఠాత్మక మెరీనా ప్రాజెక్టు ఏర్పాటుతో పాటు, రాష్ట్రానికి రూ.19,391 కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 'గేమ్ ఛేంజర్'గా మార్చి, యువతకు భారీగా ఉపాధి కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలతో పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో మొత్తం 14 కొత్త సంస్థలు ఏర్పాటవుతాయి. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 11,753 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. సమావేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా కృష్ణా నది తీరంలో మెరీనా ప్రాజెక్టుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. దీంతో పాటు, రాష్ట్రంలో సరకు రవాణా రంగాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు 'ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్'ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇతర ముఖ్యమైన నిర్ణయాలలో, రాష్ట్రవ్యాప్తంగా 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ కోసం రూ.944.53 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో కొత్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు, జల్ జీవన్ మిషన్ కింద రూ.5,000 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ ఇచ్చేందుకు కూడా కేబినెట్ అంగీకరించింది. ఎక్సైజ్ విధానంలో భాగంగా బార్లపై ఉన్న అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్నును ఉపసంహరించుకోవాలని, కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా మంత్రులందరూ పాల్గొన్నారు. తాజా నిర్ణయాలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు మరింత ఊతమిస్తాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

## అమరావతిని బెస్ట్ సిటీగా

# తీర్చిదిద్దుతా: చంద్రబాబు

విజయవాడ, జనవరి 8 (ఈవార్తలు): తెలుగు సంస్కృతి, సినిమా, సాహిత్యం, కళలు, రుచుల సమ్మేళనంగా విజయవాడలో 'అమరావతి-ఆవకాయ ఫెస్టివల్ 2026' అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పున్నమిఘాట్‌లోని ప్రధాన వేదికపై మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణా నదిలో నూతనంగా ఏర్పాటు చేసిన హౌస్ బోట్లను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతి దేవతల రాజధాని అని, వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. ఎంతమంది ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎవరు ఎంత బాధపడినా అమరావతిని దేశంలోనే బెస్ట్ సిటీగా, డైనమిక్ సిటీగా తీర్చిదిద్ది తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడను అత్యంత పరిశుభ్రమైన నగరంగా (క్లీనెస్ట్ సిటీ), అమరావతిని పచ్చని నగరంగా (గ్రీన్ సిటీ) మారుస్తామని హామీ ఇచ్చారు. కృష్ణా నది ఒడ్డున గంట సేపు గడిపితే ఎలాంటి ధ్యానం అవసరం లేదని, అంతటి ప్రశాంతత ఇక్కడ ఉందని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో పండుగలు, సంబరాలు కనుమరుగై ప్రజల ముఖాల్లో నవ్వులు కరవయ్యాయని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడలో విజయ ఉత్సవ్, దసరా వేడుకలను ప్రపంచస్థాయిలో నిర్వహించామని గుర్తుచేశారు.



ఒకప్పుడు దసరా అంటే మైసూరు, కలకత్తా గుర్తుకొచ్చేవని, ఇప్పుడు విజయవాడ పేరు వినిపించేలా చేశామని అన్నారు. ఆవకాయ అనగానే ప్రపంచవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ గుర్తుకొస్తుందని, భారతదేశంలో ఫుడ్ అంటే ఆంధ్రప్రదేశ్ అనే స్థాయికి మన వంటకాల ఖ్యాతి ఉందని కొనియాడారు. తెలుగు సినిమా వైభవాన్ని ప్రస్తావిస్తూ, 'భక్త ప్రహ్లాద' నుంచి 'బాహుబలి' వరకు తెలుగు చిత్రసీమ ఎన్నో శిఖరాలను అధిరోహించిందని అన్నారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శోభన్‌బాబు వంటి మహానటులు కృష్ణా జిల్లా నుంచే వచ్చి చిత్రసీమకు దిక్సూచిగా నిలిచారని, నేడు పవన్ కల్యాణ్, బాలకృష్ణ వంటి వారు దాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. సంపద సృష్టిలో, వ్యాపార చతురతలో కృష్ణా జిల్లా ప్రజలు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, విశాఖపట్నాన్ని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతామని, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ద్వారా ఇళ్లలోనే గ్యాస్ తయారుచేసుకునే సాంకేతికతను అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోవని, పర్యాటకం, సాంకేతికతతో మరిన్ని ఉద్యోగాలు సృష్టిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఉత్సవాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత విజయవాడ ప్రజలదేనని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు పాల్గొన్నారు.



## అమరావతి రెండో దశ పిచ్చి పని

**భూసేకరణపై జగన్ విమర్శలు**

తాడేపల్లి, జనవరి 8 (ఈవార్తలు): అమరావతి రాజధానిలో రెండో దశ భూ సమీకరణ చేపట్టాలన్న ప్రభుత్వ ఆలోచనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మొదటి విడతలో సేకరించిన భూములనే అభివృద్ధి చేయకుండా మరోసారి భూములు తీసుకోవడం పిచ్చి పని అని అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. "రాజధాని కోసం మొదటి దశలో 50 వేల ఎకరాలు తీసుకున్నారు. ఆ భూమిలో రోడ్లు, కరెంటు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికే లక్ష కోట్ల రూపాయలు అవసరమని స్వయంగా చంద్రబాబే చెప్పారు. ఆ డబ్బు ఎక్కడి నుంచి, ఎప్పుడు వస్తుందో స్పష్టత లేదు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు" అని జగన్ ప్రశ్నించారు. తొలిదశలో భూములు ఇచ్చిన రైతులు ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. "ఇలాంటి పరిస్థితుల్లో రెండో దశ పేరుతో మరో 50 వేల ఎకరాలు ఎందుకు సేకరిస్తున్నారు? మొత్తం లక్ష ఎకరాల అభివృద్ధికి రెండు లక్షల కోట్లు అవసరమవుతాయి. ఈ డబ్బంతా ఎక్కడి నుంచి తెస్తారు? కేవలం చంద్రబాబు, ఆయన బినామీలు దోచుకోవడానికే ఈ భూసేకరణ జరుగుతోంది" అని జగన్ ఘాటుగా ఆరోపించారు. రాజధాని అభివృద్ధి పేరుతో రైతులను మోసం చేస్తున్నారని, ప్రభుత్వం వారికి వెంటనే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఏపీలో 13 మంది అధికారులపై కేసులు




న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 13 మంది ప్రభుత్వ అధికారులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసుల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును కొనసాగించేందుకు సర్వోన్నత న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. ఈ కేసులకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేస్తూ గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. 2016-2020 మధ్య కాలంలో పలువురు ప్రభుత్వ అధికారులపై ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలతో ఏసీబీ కేసులు నమోదు చేసింది. విజయవాడలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) ద్వారా ఈ ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే, ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసే నాటికి సీఐయూను అధికారికంగా పోలీస్ స్టేషన్‌గా నోటిఫై చేయలేదని, కాబట్టి ఆ కేసులకు చట్టబద్ధత లేదని నిందిత అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వాదనతో ఏకీభవించిన హైకోర్టు, ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఏసీబీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సాంకేతిక కారణాలతో అవినీతి కేసుల దర్యాప్తును అడ్డుకోవడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని, ఇది న్యాయ వ్యవస్థకే అవమానకరమని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ, దర్యాప్తు కొనసాగించాలని ఏసీబీని ఆదేశించింది. అయితే, 6 నెలల్లోగా దర్యాప్తు పూర్తి చేయాలని, ఈ సమయంలో అరెస్టు వంటి కఠిన చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. ఇకపై ఇలాంటి సాంకేతిక అంశాలపై దాఖలయ్యే పిటిషన్లను హైకోర్టులు విచారించరాదని కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది.




## ఏపీలో నిలిచిపోనున్న అద్దె బస్సులు

**సమ్మెకు యజమానుల పిలుపు**

విజయవాడ, జనవరి 8 (ఈవార్తలు): ఏపీఎస్ ఆర్టీసీలో సమ్మె వాతావరణం నెలకొంది. అద్దె బస్సుల యజమానులు సమ్మె సైరన్ మోగించారు. తమకు చెల్లించే అద్దెను పెంచాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 12వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సులను నిలిపివేయనున్నట్లు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. స్త్రీశక్తి పథకం అమలు తర్వాత బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగిందని, దీనివల్ల తమపై అదనపు భారం పడుతోందని యజమానులు చెబుతున్నారు. మరోవైపు పెరిగిన ఇంధన, నిర్వహణ ఖర్చులతో నష్టాలు వస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో అద్దె పెంచడం తప్పనిసరి అని వారు వాదిస్తున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ యాజమాన్యంతో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. యాజమాన్యం నెలకు అదనంగా రూ. 5,200 ఇచ్చేందుకు ముందుకొచ్చినా, ఈ పెంపు చాలా స్వల్పమని యజమానుల సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. తమతో చర్చించి అద్దెను మరింత పెంచాలని కోరుతూ సమ్మెకు దిగుతున్నట్లు స్పష్టం చేశాయి.

## మగాళ్లు వీధి కుక్కలతో సమానం

**సినీ నటి రమ్య వివాదాస్పద పోస్ట్**

బెంగళూరు: కన్నడ చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన రమ్య... ఆ తర్వాత రాజకీయాల్లో సైతం తనదైన ముద్ర వేశారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆమె యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉన్నారు. చిత్రరంగంలోకి తిరిగి వచ్చిన ఆమె ఒక సినిమా నిర్మాణ సంస్థను కూడా స్టార్ట్ చేశారు. రాజకీయాల నుంచి దూరమైనా సామాజిక అంశాలపై స్పందిస్తూ యాక్టివ్‌గా ఉంటున్నారు. ముఖ్యంగా జంతు ప్రేమికురాలైన రమ్య... మూగ జీవుల హక్కులు, వీధి కుక్కల సమస్యలపై తరచూ తన అభిప్రాయాలు చెబుతుంటారు. గత ఏడాది వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. వీధి కుక్కలను ఆశ్రయ కేంద్రాల్లో ఉంచాలని సుప్రీం సూచించింది. ఈ సూచనపై రమ్యతో పాటు దేశవ్యాప్తంగా కుక్కల ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు చోట్ల నిరసనలు కూడా జరిగాయి. తాజాగా ఇదే అంశంపై మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, వీధి కుక్కలను వాటి ప్రవర్తన ఆధారంగా వర్గీకరించడం సాధ్యం కాదని చెప్పింది. ఈ కుక్క కాటేస్తుంది, ఈ కుక్క కాటేయదు అని ముందుగా తెలుసుకోవడం అసాధ్యమని... అందుకే అన్ని వీధి కుక్కలను ఆశ్రయ కేంద్రాల్లో ఉంచడమే సరైనదని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలపై రమ్య అసంతృప్తి వ్యక్తం చేశారు.



# ఇక ఇస్రో అన్వేష

**మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధం**


**ఈ నెల 12న పీఎస్ఎల్వీ-సీ62 ద్వారా ప్రయోగం**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2026 సంవత్సరంలో తన తొలి ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ నెల 12వ తేదీన ఉదయం 10:17 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగం ద్వారా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌తో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు.

శ్రీహరికోట, జనవరి 8 (ఈవార్తలు): ఈ మిషన్‌లో ప్రధాన ఉపగ్రహానికి 'అన్వేష' అని కూడా పేరు పెట్టారు. వ్యవసాయం, పట్టణ ప్రణాళిక, పర్యావరణ పర్యవేక్షణ వంటి కీలక రంగాలలో దేశ సామర్థ్యాన్ని పెంచడానికి ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. "రాకెట్, ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. ప్రయోగానికి ముందు జరగాల్సిన తనిఖీలు కొనసాగుతున్నాయి" అని ఇస్రో ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రయోగంలో స్పెయిన్‌కు చెందిన ఒక స్టార్టప్ అభివృద్ధి చేసిన 'కెస్ట్రెల్ ఇనీషియల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్డ అనే ఒక చిన్న రీ-ఎంట్రీ వాహనాన్ని కూడా పరీక్షిస్తున్నారు. అన్ని ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత ఇది భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించి దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో కూలిపోనుంది. పీఎస్ఎల్వీ రాకెట్‌కు ఇది 64వ ప్రయోగం కాగా, రెండు స్ట్రాప్-ఆన్ మోటార్లు కలిగిన పీఎస్ఎల్వీ-డీఎల్ వేరియంట్‌తో ఇది ఐదో ప్రయోగం. చంద్రయాన్-1, మార్స్ ఆర్బిటర్ మిషన్, ఆదిత్య-ఎల్1 వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక ప్రయోగాలను పీఎస్ఎల్వీ విజయవంతంగా పూర్తి చేసింది.

## ఫిట్‌నెస్ అంటే సన్నగా అవడం కాదు

**మహిళలకు బిపాషా బసు మెసేజ్**



ముంబై: బాలీవుడ్ బ్యూటీ బిపాషా బసు నిన్న తన 47వ పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆమె ఒక విలువైన మెసేజ్ ఇచ్చారు. ఫిట్‌నెస్ అంటే కేవలం డైటింగ్ చేసి సన్నగా అయిపోవడం కాదని, శరీరం లోపలి నుంచి ఎంత బలంగా ఉందనేదే నిజమైన ఫిట్‌నెస్ అని ఆమె స్పష్టం చేశారు. మన దేశంలో జిమ్ కల్చర్ పెద్దగా లేని రోజుల్లోనే బిపాషా ఫంక్షనల్ ఫిట్‌నెస్ గురించి అందరికీ తెలిసేలా చేశారు. ముఖ్యంగా బరువులు ఎత్తడం (వెయిట్ ట్రెయినింగ్) కేవలం మగవారికి మాత్రమే కాదు, మహిళలకు కూడా చాలా అవసరమని ఆమె గట్టిగా చెబుతున్నారు.

## మంచి చేస్తే ముంచేస్తున్నారు!

**ప్రధాని మోదీపై ఉద్ధవ్ ఠాక్రే ఫైర్**



ముంబై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థకరే తీవ్ర విమర్శలు చేశారు. నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని చేయాలనే ఉద్దేశంతో తాను రెండుసార్లు ఆయన కోసం ప్రచారం చేస్తే, ఆయన మాత్రం ఇప్పుడు తనకు రాజకీయంగా ముగింపు పలకాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీటీఐ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ, మోదీని ప్రధానిగా చేయడానికి తాను 2014, 2019లలో ప్రచారం చేశానని గుర్తు చేశారు. అయితే, ఆయన తన పార్టీని విచ్ఛిన్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు ఆయన కోసం ప్రచారం చేసినందుకు తనకు బాధగా, కోపంగా ఉందని అన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర నుంచి ముంబైని వేరు చేయాలన్న ఉద్దేశం బీజేపీకి ఎప్పటి నుంచో ఉందని ఆయన ఆరోపించారు. బాలాసాహెబ్ థకరే ప్రస్తుతం లేరని బీజేపీ భావిస్తోందని, అందుకే 'సేన'ను కాగితంపై వారు ముగించారని, కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అలా చేయలేరని అన్నారు. బాల్ థకరే ఉన్నప్పుడు 2012 వరకు వాళ్లు జాగ్రత్తగా ఉండేవారని బీజేపీని ఉద్దేశించి అన్నారు.

## యూపీలో ప్రభుత్వ టీచర్‌గా పాకిస్థానీ!

లక్నో: పాకిస్థాన్ జాతీయురాలై ఉండి, ఆ విషయాన్ని దాచిపెట్టి ప్రాథమిక విద్యా విభాగంలో ఉద్యోగం పొందిన మహిళా ఉపాధ్యాయురాలిపై ఉత్తరప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేశారు. రాంపూర్ ప్రాంతానికి చెందిన మహిరా అక్తర్ అలియాస్ ఫర్జానా అనే మహిళ 1979లో పాకిస్థాన్ వ్యక్తిని వివాహం చేసుకున్నారని పోలీసులు తెలిపారు. ఆ తరువాత ఆమె పాకిస్థాన్ పౌరసత్వం పొందినట్లు పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల అనంతరం భర్తతో విడాకులు తీసుకుని ఇద్దరు పిల్లలతో పాకిస్థాన్ వీసాపై ఆమె భారతదేశానికి వచ్చింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుని, తాను భారతీయురాలినని చెప్పుకుంటూ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సంపాదించింది. రాంపూర్ జిల్లాలోని ఓ గ్రామంలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఫర్జానాపై విద్యా శాఖ అధికారులు అంతర్గత విచారణ చేపట్టగా ఆమె పాకిస్థాన్ జాతీయురాలని తేలింది. నకిలీ పత్రాలతో ఉద్యోగం పొందినట్లు గుర్తించిన అధికారులు ఆమెను తొలుత సస్పెండ్ చేశారు. ఆ తరువాత ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

న్యూఢిల్లీ: కువైట్ న్యాయస్థానం మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష విధించింది. హెరాయిన్, మెథంఫెటమైన్‌లతో పట్టుబడిన ఇద్దరికి అక్కడి న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన కువైట్ అంతర్గత వ్యవహారాల శాఖ, ఇటీవల ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా డ్రగ్ కంట్రోల్ అధికారులు కైఫాన్, షువైఖ్ ప్రాంతాల్లో నిఘా పెట్టి ఇద్దరు భారతీయులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని సమాచారం. ఈ మేరకు ఆధారాలను ప్రాసిక్యూటర్లు కోర్టులో ప్రవేశపెట్టగా, దోషులకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.



## అమేథీ ఓటరు జాబితాలో స్మృతి ఇరానీ

అమేథీ: ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పేరును అమేథీ ఓటరు లిస్టులో సిర్ ప్రకారం చేర్పించారు. అమేథీ నియోజకవర్గం నుంచి ఆమె గతంలో ఎంపీగా చేశారు. గౌరీగంజ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న మేదాన్ మవాయి గ్రామంలో స్మృతి ఇరానీ పేరును ఓటరు లిస్టులో నమోదు చేశారు. ఆ గ్రామంలో మాజీ మంత్రి ఇరానీ కొత్తగా ఇంటిని కట్టుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ మాజీ మంత్రి స్మృతి ఇరానీ ఇదే గ్రామం నుంచి తన ఓటును రిజిస్టర్ చేసుకున్నారని బీజేపీ అమేథీ జిల్లా అధ్యక్షుడు సుధాన్షు శుక్లా తెలిపారు. ఆ గ్రామం నుంచే ఆమె ఓటు వేసినట్లు తెలిపారు. 2014 నుంచి అమేథీ రాజకీయాల్లో స్మృతి యాక్టివ్‌గా ఉన్నారు. అప్పటి నుంచి అక్కడే కొనసాగుతున్నారు. 2014లో రాహుల్ గాంధీపై ఓడిపోయారు. అయితే 2019లో రాహుల్ గాంధీని ఆమె ఓడించారు. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీ లాల్ శర్మ చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. అమేథీతో రిలేషన్ విడదీయలేమని, ఇక్కడ నుంచే ఆమె ఓటు వేస్తారని శుక్లా తెలిపారు. మేదాన్ మవాయి కంపోజిట్ స్కూల్ లీలా టిక్రా మవాయి పోలింగ్ స్టేషన్‌లో 514 సీరియల్ నెంబర్‌లో స్మృతి ఇరానీ పేరు ఉన్నది. ఆ పోలింగ్ స్టేషన్‌లో మొత్తం 666 రిజిస్టర్ ఓటర్లు ఉన్నారు. మేదాన్ మవాయి గ్రామంలో 2021 ఫిబ్రవరిలో ఆమె 1100 గజాల స్థలం కొన్నారు. అక్కడ ఇళ్లు నిర్మించి 2024లో గృహప్రవేశం చేశారు.







## ఐప్యాక్ డాక్యుమెంట్లు ఎత్తుకెళ్లిన మమత

**ఈడీ సంచలన ఆరోపణలు**

కోల్‌కతా: కోల్‌కతాలోని ఐ-ప్యాక్ సంస్థపై దాడుల వ్యవహారంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఈడీ సంచలన ఆరోపణలు చేసింది. ఐ-ప్యాక్ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో దాడులు జరుగుతున్న సమయంలో మమతా బెనర్జీ ఆ ఇంట్లోకి ప్రవేశించి, ఎలక్ట్రానిక్ పరికరాలు, పలు దస్త్రాలు సహా కీలక ఆధారాలను తీసుకువెళ్లారని పేర్కొంది. ముఖ్యమంత్రి, ఆమె సహాయకులు, పోలీసులు వాటిని బలవంతంగా తీసుకెళ్లారని అన్నారు. బొగ్గు అక్రమ రవాణా ద్వారా ఆదాయం పొందిన వ్యక్తులకు సంబంధించి కోల్‌కతాలో ఈ సోదాలు చేపట్టినట్లు ఈడీ వెల్లడించింది. హవాలా మనీతో ఐ-ప్యాక్‌కు సంబంధం ఉందని, ఇందులో ఒక వ్యక్తికి, ఈ సంస్థకు మధ్య కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని తెలిపింది. పెద్ద సంఖ్యలో పోలీసు అధికారులతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఐ-ప్యాక్ డైరెక్టర్ నివాసానికి వచ్చారని తెలిపారు. అప్పటి వరకు సోదాలు శాంతియుతంగా జరిగాయని ఈడీ వెల్లడించింది. సాధారణ ప్రక్రియలో భాగంగానే ఈ సోదాలు నిర్వహించినట్లు తెలిపింది. ఏ రాజకీయ పార్టీని, ఏ ఎన్నికను లక్ష్యంగా చేసుకుని ఈ సోదాలు చేపట్టలేదని స్పష్టం చేసింది.




## బుక్ మై షోకు భారీ దెబ్బ

**నాలుగున్నర లక్షల టికెట్ల డబ్బులు రిఫండ్**

**సెన్సార్ సర్టిఫికెట్ రాక జన నాయగన్ వాయిదా**

**5 నుంచి 7 రోజుల్లో క్రెడిట్ కానున్న డబ్బులు**

చెన్నై: కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ చివరి సినిమా 'జన నాయగన్ణ రేపు జనవరి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కావాల్సి ఉండగా, సెన్సార్ సర్టిఫికేట్ ఆలస్యం కారణంగా విడుదల వాయిదా పడింది. దాదాపు 500 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం మీద విజయ్ ఫ్యాన్స్ భారీ ఆశలు పెట్టుకున్నారు. బుకింగ్స్ ఓపెన్ అయిన క్షణంలోనే లక్షలాది టికెట్లు సేల్ అయ్యాయి. కానీ ఈ సినిమా విడుదల వాయిదా పడటం... భారతీయ సినిమా చరిత్రలోనే అరుదైన రికార్డుకు కారణమైంది. సాధారణంగా సినిమా పోస్ట్‌పోన్ అయితే కొన్ని వందలు లేదా వేల టికెట్లు రిఫండ్ అవుతుంటాయి. ఇక్కడ మాత్రం ఏకంగా 4.5 లక్షల టికెట్లను బుక్‌మైషో ప్లాట్‌ఫాం రిఫండ్ చేయాల్సి వచ్చింది. ఇంత భారీ సంఖ్యలో ఒకేసారి టికెట్లు క్యాన్సిల్ చేసి, ప్రేక్షకుల ఖాతాల్లోకి డబ్బులు తిరిగి జమ చేయడం భారతీయ సినిమా చరిత్రలో ఇదే మొదటిసారి. లక్షలాది మంది ఫ్యాన్స్ నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చిన నేపథ్యంలో బుక్‌మైషో, డిస్ట్రిబ్యూటర్లు ఈ గట్టి నిర్ణయం తీసుకున్నారు.

## అమెరికాలో డ్రగ్స్‌తో పట్టుబడ్డ భారత డ్రైవర్లు



ఇండియానా: అమెరికాలో ఇద్దరు భారత ట్రక్ డ్రైవర్లు భారీ కొకైన్‌తో పట్టుబడ్డారు. ఆ కొకైన్ విలువ మన కరెన్సీలో దాదాపు రూ.62 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇండియానా పరిధిలో హైవేపై పోలీసులు తనిఖీలు చేస్తుండగా, ఇద్దరు భారత డ్రైవర్లు ట్రక్కులో తరలిస్తున్న కొకైన్ ను పోలీసులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అయితే, తమ ట్రక్కులో కొకైన్ ఉందనే విషయం తెలియదని నిందితులు చెబుతున్నారు. పట్టుబడ్డ డ్రైవర్లను గుర్ ప్రీత్ సింగ్ (25), జస్వీర్ సింగ్ (30)గా గుర్తించారు. అమెరికన్ మీడియా కథనం ప్రకారం.. నిందితులు ఇద్దరూ కొంతకాలం క్రితం వేర్వేరుగా అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించారు. ఇక్కడ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వీరు ట్రక్కులో రిచ్ మండ్ వెళ్తుండగా.. ఇండియానా పోలీసులు హైవేపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ ట్రక్కులో డ్రగ్స్ ఉన్న విషయాన్ని శునకాలు పసిగట్టాయి. దీంతో అనుమానం వచ్చి పోలీసులు తనిఖీ చేయగా.. డ్రైవర్ల స్లీపర్ బెర్త్ కింద పదుల సంఖ్యలో కార్డ్ బోర్డ్ బాక్సుల్ని గుర్తించారు. వాటిని తెరిచి చూడగా అందులో నిషేధిత కొకైన లభించింది. ఇది మొత్తం 309 పౌండ్లుగా ఉంది. దీని విలువ మన కరెన్సీలో దాదాపు రూ.62 కోట్లుపైగానే ఉంటుంది. ఈ కొకైన్ తో 1,13,000 మందిని చంపొచ్చని పోలీసులు అంటున్నారు. దీనిపై నిందితులు మాట్లాడుతూ.. తమకు అందులో డ్రగ్స్ ఉన్న విషయం తెలియదని చెప్పారు. రిచ్మండ్లోని ఒక ఇండియన్ రెస్టారెంట్ కు వెళ్లాల్సిందిగా యజమానులు సూచించారని, అక్కడ లోడ్ చేస్తారని చెప్పారని, దీంతో తాము ట్రక్కు తీసుకుని బయల్దేరామని తెలిపారు. డ్రగ్స్‌తో తమకేం సంబంధం లేదని చెప్పారు. ప్రస్తుతం పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## సంపాదనలో 75 శాతం దానం

**వేదాంత అధినేత కీలక నిర్ణయం**

ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త, వేదాంత గ్రూప్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన కుమారుడు అగ్నివేశ్ అగర్వాల్ (49) అమెరికాలో అకాల మరణం చెందారు. ఈ పుత్రశోకంలోనే, తన సంపాదనలో 75 శాతం సమాజ సేవకు కేటాయిస్తానని గతంలో చేసిన వాగ్దానాన్ని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. అమెరికాలో స్కీయింగ్ ప్రమాదంలో గాయపడిన అగ్నివేశ్, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న సమయంలో గుండెపోటుతో కన్నుమూశారు. కుమారుడి మరణంతో తీవ్ర ఆవేదనకు గురైన అనిల్ అగర్వాల్, 'ఎక్షణ వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ పెట్టారు. "నా కొడుకు అగ్ని మమ్మల్ని ఇంత త్వరగా విడిచి వెళ్ళిపోయాడు. నా స్నేహితుడిలా ఉండేవాడు. మా సంపాదనలో 75 శాతం సమాజానికి ఇస్తానని వాగ్దానం చేశాను. ఆ మాటను ఈరోజు మరోసారి పునరుద్ఘాటిస్తున్నాను. నువ్వు లేకుండా ఈ మార్గంలో ఎలా నడవాలో తెలియడం లేదు, కానీ నీ ఆలోచనలను ముందుకు తీసుకెళతాను" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏ బిడ్డా ఆకలితో నిద్రపోకూడదని, ప్రతి మహిళ స్వశక్తితో నిలబడాలని, యువతకు ఉపాధి లభించాలని తామిద్దరం కలలు కన్నామని, ఆ కలను నెరవేరుస్తానని ఆయన తెలిపారు. మరణించిన అగ్నివేశ్, వేదాంత అనుబంధ సంస్థ తల్వండి సోబో పవర్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. సుమారు రూ. 27,000 కోట్ల సంపద కలిగిన అనిల్ అగర్వాల్‌కు అగ్నివేశ్‌తో పాటు కుమార్తె ప్రియా అగర్వాల్ కూడా ఉన్నారు. అగ్నివేశ్ మృతి పట్ల మోదీ సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో భగవంతుడు అగర్వాల్ కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షస్తూ ట్వీట్ చేశారు. కుమారుడిని కోల్పోయిన తీవ్ర దుఃఖంలోనూ తన దాతృత్వ సంకల్పాన్ని అనిల్ అగర్వాల్ మరోసారి చాటడం గమనార్హం.

## పీఎఫ్ రికార్డుల మార్పు సులభం

**ట్రాన్స్‌జెండర్ల కోసం ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) సామాజిక సమానత్వం దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌జెండర్ (లింగమార్పిడి) ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతా రికార్డులలో పేరు లేదా జెండర్ మార్చుకునే ప్రక్రియను సరళతరం చేసింది. ఇకపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ట్రాన్స్‌జెండర్ సర్టిఫికేట్ లేదా ఐడీ కార్డును ఈ మార్పుల కోసం అధికారిక ధృవీకరణ పత్రంగా ఆమోదిస్తున్నట్లు ఈపీఎఫ్ఓ ప్రకటించింది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ట్రాన్స్‌జెండర్ ఉద్యోగులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఇంతకుముందు పీఎఫ్ రికార్డులలో పేరు, పుట్టిన తేదీ లేదా జెండర్ వంటి వివరాలు మార్చుకోవాలంటే ఆధార్, పాన్ కార్డు వంటి పత్రాలు అవసరమయ్యేవి. అయితే, లింగమార్పిడి తర్వాత పాత పత్రాలతో వివరాలు మార్చుకోవడం ట్రాన్స్‌జెండర్లకు ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు ఈపీఎఫ్ఓ ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్ణ జారీ చేసే ఐడీ కార్డును చెల్లుబాటయ్యే పత్రాల జాబితాలో చేర్చింది. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ చట్టం-2019కి అనుగుణంగా వారికి సమాన అవకాశాలు కల్పించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నారు. అర్హులైన ఉద్యోగులు ఈపీఎఫ్ఓ యూనిఫైడ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో 'జాయింట్ డిక్లరేషన్ణ సమర్పించి, తమ ట్రాన్స్‌జెండర్ ఐడీ కార్డును అప్‌లోడ్ చేయడం ద్వారా వివరాలను సులభంగా అప్‌డేట్ చేసుకోవచ్చు.

ఈవార్తలు
వినోదవాణి CINEMA
శుక్రవారం 9-1-2026 | www.evarthalu.com | 6

లక్ష్యూరి చిత్రం

మిశా నారంగ్



# ఫుల్ కామెడీతో అనగనగా ఒక రాజు!

**ట్రైలర్ విడుదల.. గోదారోళ్లకు సంక్రాంతి కానుక**




టాలీవుడ్ నటుడు నవీన్ పొలిశెట్టి తన కామెడీతో మరోసారి థియేటర్లలో నవ్వుల జాతర సృష్టించడానికి సిద్ధమయ్యారు. సంక్రాంతి రేసులో నిలిచిన మోస్ట్ అవేటెడ్ మూవీ అనగనగా ఒక రాజు థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం నేడు (జనవరి 8న) అత్యంత గ్రాండ్‌గా విడుదల చేసింది. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ట్రైలర్ చూస్తుంటే నవీన్ పొలిశెట్టి మరోసారి బాక్సాఫీస్ వద్ద తన కామెడీ పవర్‌ను పక్కాగా చూపించబోతున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా కింగ్ అక్కినేని నాగార్జున ఈ ట్రైలర్‌కు వాయిస్ ఓవర్ అందించడం ఒక పెద్ద సర్ప్రైజ్ అని చెప్పాలి. రాజు గారి కోసం బంగార్రాజు రంగంలోకి దిగారు అన్నట్లుగా సాగిన ఆయన బేస్ వాయిస్ ట్రైలర్‌కు మరింత జోష్‌ను అదనపు ఆకర్షణను ఇచ్చింది. గోదావరి జిల్లా నేపథ్యంలో, పెళ్లి చుట్టూ తిరిగే గందరగోళం మరియు హుషారైన డైలాగ్స్‌తో ట్రైలర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. ఇందులో నవీన్ ఎనర్జీకి తోడు, హీరోయిన్ మీనాక్ష చౌదరి అందం కూడా సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. మరోవైపు ఈ ఏడాది సంక్రాంతి పోటీ అత్యంత రసవత్తరంగా ఉండబోతుంది. ప్రభాస్ ది రాజా సాబ్, చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు వంటి భారీ చిత్రాల మధ్య జనవరి 14న అనగనగా ఒక రాజు తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.



# ప్రభాస్‌ను నెట్టేసి.. నం.1 గా సారా అర్జున్

రణ్‌వీర్ సింగ్ హీరోగా, సారా అర్జున్ హీరోయిన్ గా తెరకెక్కిన ధురంధర్ మంచి హిట్ గా కొనసాగుతుంది ఈ సినిమాలో తన నటనతో అందరినీ మెప్పించిన సారా అర్జున్ ఇప్పుడందరి దృష్టిని ఆకర్షిస్తూ వార్తల్లోకెక్కారు. దీంతో ప్రముఖ ఎంటర్టైన్మెంట్ పోర్టల్ ఐఎండీబీ ట్రెండింగ్ సెలబ్రిటీల లిస్ట్ లో సారా నెం.1 పొజిషన్ ను దక్కించుకుని రికార్డు సృష్టించారు. ఐఎండీబీ ప్రతీ వారం పాపులర్ ఇండియన్ సెలబ్రిటీస్ లిస్ట్ ను అనౌన్స్ చేస్తుంది. ఈ వారం లిస్ట్ లో సారా టాప్ లో నిలిచారు. సారా ఈ లిస్ట్ లో ప్రభాస్, విజయ్ లాంటి పాన్ ఇండియా హీరోలను కూడా వెనక్కి నెట్టి మరీ మొదటి స్థానంలో ఉండటం విశేషం. ఈ లిస్ట్ లో విజయ్ 8వ స్థానంలో ఉండగా, ప్రభాస్ 19వ స్థానంలో ఉన్నారు.

# వేసవి కానుకగా విశ్వంభర




మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రమే మన శంకర వరప్రసాద్ గారు. మంచి అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా దీనికి ముందే గత ఏడాది సంక్రాంతికి ప్లాన్ చేసిన చిత్రం విశ్వంభర కూడా మోస్ట్ అవైటెడ్ గా ఉంది. మరి ఈ సినిమాకి సంబంధించి ప్రస్తుతం అంతా నిశ్శబ్దంగానే ఉంది. ఆ మధ్య ఎపుడో ఈ సినిమాని ఈ ఏడాది వేసవి కానుకగా రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత మళ్ళీ మామూలే.. ఇక ఫైనల్ గా ఈ సినిమా రిలీజ్ పై మరోసారి ఓ క్లారిటీ బయటకి వచ్చింది. ఈ సినిమా రిలీజ్ ప్లాన్స్ లో ఎలాంటి మార్పు లేదు మేకర్స్ ఈ ఏడాది వేసవి కనుకగానే ఈ విజువల్ ట్రీట్ ని అందిస్తున్నట్టు కన్ఫర్మ్ చేశారు.

# రాజాసాబ్‌తో తేలిపోనున్న భవిష్యత్తు!



ది రాజాసాబ్ మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ప్రచార చిత్రాలతో హిట్ కొడతామనే ధీమాతో టీమ్ కాన్ఫిడెంట్ గా ఉంది. అభిమానుల్లోనే అంతే నమ్మకం కనిపిస్తోంది. మరి ఈ సినిమా సక్సెస్ ప్రధానంగా ఎంతమందికి కీలకం అంటే.. సినిమాలో ముగ్గురు హీరయిన్లకు ఈ విజయం అత్యంత కీలకమైంది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత నిధి అగర్వాల్ కి ఒక్క హిట్ పడలేదు. స్టార్స్ చిత్రాల్లో అవకాశాలైతే అందుకుంది గానీ ఆ సినిమాలేవి విజయం సాధించలేదు. దీంతో అమ్మడి చేతిలో బిగ్ ప్రాజెక్ట్ ఇది ఒక్కటే. ఈ సినిమా విజయం సాధిస్తేనే నిధి అగర్వాల్ కొత్త అవకాశాలతో బిజీ అవుతుంది. లేదంటే మరో ఛాన్స్ కష్టమనే టాక్ వినిపిస్తోంది. ఇదే సినిమాతో మాలీవుడ్ బ్యూటీ మాళవికా మోహనన్ ఎంట్రీ ఇస్తుంది. తొలి ఛాన్స్ ఏకంగా ప్రభాస్ తోనే అందుకుంది.



# నేషనల్ క్రష్ అంటే.. క్యూట్ అంతే!

హీరోయిన్‌గా కాకుండా పన్ను చెల్లించే విషయంలో రష్మిక మందన్నా నంబర్ 1 గా నిలిచి అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. కేవలం హీరోయిన్‌గానే కాకుండా కుటుంబంకు చెందిన వ్యాపారాల్లోనూ భాగస్వామ్యం ఉన్న కారణంగా రష్మిక అత్యధిక పన్ను చెల్లించినట్లు తెలుస్తోంది. ఒక జాతీయ మీడియా సంస్థ కథనం అనుసారంగా రష్మిక మందన్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు త్రైమాసికాలకు కలిపి ఏకంగా 4.69 కోట్ల పన్ను చెల్లించింది. కన్నడకు చెందిన హీరోయిన్స్ ఈ స్థాయిలో పన్ను చెల్లించడం చాలా అరుదు.

# బోల్డ్ సీన్స్‌తో యశ్ ఎంట్రీ..!



కన్నడ రాకింగ్ స్టార్ యష్ అభిమానుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. యష్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-వరల్డ్ మూవీ టాక్సిక్ నుంచి టీజర్‌ను మేకర్స్ నేడు విడుదల చేశారు. కేజీఎఫ్ తర్వాత దాదాపు నాలుగేళ్ల గ్యాప్ తీసుకున్న యష్ ఈ టీజర్‌తో బాక్సాఫీస్ వద్ద మరో సునామీ సృష్టించడం ఖాయమని తెలుస్తుంది. దాదాపు మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ టీజర్ ప్రారంభం నుంచే ప్రేక్షకులను ఒక భయంకరమైన గ్యాంగ్‌స్టర్ ప్రపంచంలోకి తీసుకెళ్లింది. ఇందులో యష్ పాత్ర పేరు రాయ అని తెలుస్తుంది. శత్రువుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా స్మశానవాటిక సెటప్‌లో యష్ కారుతో ఇచ్చే ఎంట్రీ సీన్ హైలైట్‌గా నిలిచింది. పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, నోట్లో సిగార్.. చేతిలో అత్యాధునిక గన్‌తో యష్ మునుపెన్నడూ లేనంత స్టైలిష్‌గా, క్రూరంగా కనిపిస్తున్నారు. టీజర్ చివరలో గన్‌తో ఫైర్ చేస్తూ యష్ చెప్పే డాడీ ఈజ్ హోమ్ అనే డైలాగ్ థియేటర్లలో విజిల్స్ వేయించడం గ్యారెంటీ. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఈ చిత్రాన్ని కేవలం ఒక యాక్షన్ సినిమాగా కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఒక డార్క్ ఫెయిరీ టేల్గా తీర్చిదిద్దారు. రవి బస్రూర్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణం పోసింది.

# జియో స్టార్‌లో రాజా సాబ్

రెబల్ స్టార్ ప్రభాస్ లేటెస్ట్ చిత్రం ది రాజా సాబ్ భారీ అంచనాల మధ్య గ్రాండ్ ప్రీమియర్ షోలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. దర్శకుడు మారుతి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా హారర్ కామెడీ జానర్‌లో రూపొందగా, ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్స్ భారీ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ఇక ఈ సినిమా ఇప్పుడు థియేటర్లలోకి రావడంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాను చూసేందుకు ఆసక్తి మరింత పెరిగింది. అయితే, ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ పార్ట్‌నర్‌గా జియో హాట్‌స్టార్ డిజిటల్ రైట్స్ దక్కించుకుంది. ఈ మేరకు మూవీ టైటిల్ కార్డ్స్‌లో వెల్లడించారు. దీంతో ఈ సినిమా థియేట్రికల్ రన్ పూర్తయ్యాక జియో హాట్‌స్టార్ వేదికపై ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ కానుంది.

ఈవార్తలు
# క్రీడావాణి SPORTS
శుక్రవారం 9-1-2026 | www.evarthalu.com 




# ఆస్ట్రేలియా ఘన విజయం

## ఇంగ్లండ్‌కు ఘోర పరాభావం

ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా విజయంతో ముగించింది. ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి టెస్ట్‌లోనూ 5 వికెట్లతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఈ సిరీస్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన ఆసీస్ 4-1తో యాషెస్ సిరీస్‌ను నిలబెట్టుకుంది. నాలుగో టెస్ట్‌లో గెలిచి ఉత్సాహం కనబర్చిన ఇంగ్లండ్‌కు ఆఖరి టెస్ట్‌లో ఘోర పరాభావం ఎదురైంది. 302/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 88.2 ఓవర్లలో 342 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్, సెంచరీ హీరో జాకోబ్ బెతెల్( 265 బంతుల్లో 15 ఫోర్లతో 154)ను మిచెల్ స్టార్క్ ఔట్ చేశాడు. ఓవర్‌నైట్ స్కోర్‌కు అతను 12 పరుగులు మాత్రమే చేశాడు. జోష్ టంగ్(6) సాయంతో మాథ్యూ పోట్స్(18 నాటౌట్) కాసేపు పోరాడినా.. మిచెల్ స్టార్క్ ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. జోష్ టంగ్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(3/72), బ్యూ వెబ్‌స్టార్(3/64)మూడేసి వికెట్లు తీయగా.. మైఖేల్ నేసర్ ఒక వికెట్ పడగొట్టాడు. స్కాట్ బోలాండ్ రెండు వికెట్లు తీసాడు. 183 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందుకున్న ఆస్ట్రేలియా ముందు 160 పరుగుల లక్ష్యం నమోదైంది. వన్డే తరహా బ్యాటింగ్‌తో ఆసీస్ 31.2 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ట్రావిస్ హెడ్(29), జాక్ వెదరాల్డ్(34), మార్నస్ లబుషేన్(37) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్(3/42) మూడు వికెట్లు తీయగా.. విల్ జాక్స్ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 97.3 ఓవర్లలో 384 పరుగులకు ఆలౌటైంది. జోరూట్(160) సెంచరీతో చెలరేగగా.. హ్యారీ బ్రూక్(84) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో మైఖేల్ నేజర్(4/60) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. కామెరూన్ గ్రీన్, మార్నస్ లబుషేన్ తలో వికెట్ తీసారు. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 567 పరుగుల భారీ స్కోర్ చేసింది. ట్రావిస్ హెడ్(163), స్టీవ్ స్మిత్(138) సెంచరీలతో చెలరేగగా.. బ్యూ వెబ్‌స్టర్(71 నాటౌట్) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్, జోష్ టంగ్ మూడేసి వికెట్లు తీయగా.. బెన్ స్టోక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు.

### సంక్షిప్త స్కోర్లు:

| |
|---|
| ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 384 ఆలౌట్ |
| ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 567 ఆలౌట్ |
| ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 342 ఆలౌట్ |
| ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 161/5 |



## 26.30 కోట్ల ఫ్లాట్ కొన్న రోహిత్ వైఫ్

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ సతీమణి రితికా సజ్దే ఖరీదైన ఫ్లాట్‌ను కొనుగోలు చేశారు. ముంబైలోని ప్రభాదేవీ ప్రాంతంలో రూ.26.30 కోట్ల భారీ ధర పెట్టి ఈ ఫ్లాట్‌ను తీసుకున్నారు. ఈ ఫ్లాట్ విస్తీర్ణం 2,760 స్క్వేర్ ఫీట్ కాగా.. స్టాంప్ డ్యూటీ కింద రూ.1.31 కోట్లు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.30 వేలు చెల్లించారు. అజింక్యా డీవై పాటిల్, పుజా అజింక్యా పాటిల్ అనే వ్యక్తుల నుంచి ఈ ఫ్లాట్‌ను కొనుగోలు చేశారు. ప్రస్తుతం రోహిత్ శర్మ, రితికా సజ్దే నివాసం ఉంటున్న లగ్జరీ అహూజా టవర్స్‌లోనే ఈ ఫ్లాట్ ఉంది. రోహిత్ శర్మ దంపతులు కొన్నేళ్లుగా రియల్‌ఎస్టేట్‌లో భారీగా పెట్టబడులు పెడుతున్న విషయం తెలిసిందే. గతంలో రితికా సజ్దే కార్నర్‌స్టోన్ స్పోర్ట్ అండ్ ఎంటర్టైన్మెంట్‌లో స్పోర్ట్స్ మేనేజర్‌గా పనిచేశారు. సదరు సంస్థ తరఫున ఆమె పలువురు ప్రముఖ అథ్లెట్ల ఎండార్స్‌మెంట్లు, బ్రాండ్ అసోసియేషన్లను పర్యవేక్షంచారు. విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్‌తో పాటు రోహిత్ శర్మకు మేనేజర్‌గా పనిచేశారు. రోహిత్ శర్మ దగ్గర పనిచేస్తున్నప్పుడే వారి మధ్య ప్రేమ చిగురించి పెళ్లికి దారి తీసింది. రోహిత్ శర్మతో పెళ్లి అయిన తర్వాత ఆమె తన ప్రొఫెషనల్ కెరీర్‌ను వదులుకొని ఇంటికే పరిమితమయ్యారు.




## ఐసీసీ అవార్డు రేసులో షఫాలీ

పునరాగమనంలో చితక్కొడుతున్న భారత ఓపెనర్ షఫాలీ వర్మ మరోసారి ప్లేయర్ ఆఫ్ ది మంత్ రేసులో నిలిచింది. వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆల్‌రౌండ్ షోతో ఈ అవార్డు అందుకున్న లేడీ సెహ్వాగ్.. శ్రీలంకపై హ్యాట్రిక్ అర్ధ శతకాలతో డిసెంబర్ నెలకు నామినేట్ అయింది. మహిళల విభాగంలో లారా వొల్వార్ట్, సునే లుస్ ఈ అవార్డు కోసం ఇండియన్ స్టార్‌తో పోటీ పడుతున్నారు. ఇటీవలే సొంతగడ్డపై శ్రీలంక బౌలర్లను ఊచకోత కోసింది షఫాలీ వర్మ. ఐదు టీ20ల సిరీస్‌లో ఆకాశమే హద్దుగా ఆడిన షఫాలీ.. 181.20 స్ట్రయిక్ రేటుతో 241 పరుగులు సాధించింది. ఇక వరల్డ్‌కప్ ఫామ్‌ను కొనసాగిస్తూ వన్డేల్లో వరుస శతకాలు బాదిన లారా వొర్వార్ట్ నామినేట్ అయింది. మూడు వన్డేల సిరీస్‌లో సఫారీ సారథి 205.35 స్ట్రయిక్ రేటుతో 255 పరుగులు చేసింది. ఇక ఆ జట్టుకే చెందిన ఆల్‌రౌండర్ సునే లుస్ 205 రన్స్ చేసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ బరిలో నిలిచింది. పురుషుల విభాగంలో ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు కోసం ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్, న్యూజిలాండ్ బౌలర్ జాకబ్ డఫ్ఫీ, వెస్టిండీస్ ఆల్‌రౌండర్ జస్టిన్ గ్రీవ్స్ పోటీ పడుతున్నారు.

## మార్టిన్.. మృత్యుంజయుడు

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామిన్ మార్టిన్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ప్రాణాంతకమైన మెనింజిటిస్‌తో బాధ పడుతున్న మార్టిన్ కోమా నుంచి బయటపడడమే కాదు.. దవాఖాన నుంచి ఇంటికొచ్చేశాడు. చావు అంచుల దాకా వెళ్లొచ్చిన ఈ మాజీ ఆటగాడి ఆరోగ్యం మెరుగుపడడంతో గురువారం వైద్యులు ఆస్పత్రి నుంచి పంపించేశారు. దాంతో.. మృత్యుంజయుడిలా తిరిగొచ్చిన అతడిని చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.

## ఖవాజా గుడ్‌బై

ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఉస్మాన్ ఖవాజా శకం ముగిసింది. టెస్టు స్పెషలిస్ట్‌గా ఆసీస్ విజయాల్లో కీలకమైన ఖవాజా తన సుదీర్ఘ కెరీర్‌ను చాలించాడు. యాషెస్ సిరీస్‌లో చివరిదైన సిడ్నీ టెస్టులో విజయంతో వీడ్కోలు పలికాడు. ఈ మ్యాచ్‌కు ముందే రిటైర్మెంట్ వార్తను వెల్లడించిన ఈ లెఫ్ట్‌హ్యాండర్ తన సొంత మైదానంలో సహచరులు, అభిమానుల సమక్షంలో రెడ్ బాల్ క్రికెట్‌కు అల్విదా చెప్పాడు. ఈ గ్రౌండ్‌లోనే 15 ఏళ్ల క్రితం ఇంగ్లండ్‌పైనే అరంగేట్రం చేసిన ఖవాజా.. సగర్వంగా టెస్టుల నుంచి సెలవు తీసుకున్నాడు.



## క్వార్టర్స్‌లో సింధు, సాత్విక్ జోడీ

### లక్ష్యసేన్ ఇంటికి..!

కొత్త ఏడాదిలో భారత షట్లర్ పీవీ సింధు గొప్పగా ఆడుతోంది. మలేషియా ఓపెన్ సూపర్ 1000లో దూకుడు కనబరుస్తున్న సింధు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అదిరే ఆటతో ప్రత్యర్థులకు చెక్ పెడుతున్న సాత్విక్ సాయిరాజ్ ఉ చిరాగ్ శెట్టి ద్వయం క్వార్టర్స్ బెర్తు సాధించింది. అయితే.. పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి పోరాటం ముగిసింది. ఒలింపిక్ విజేతైన సింధు నిరుడు ఒక్క టైటిల్ కూడా గెలవలేదు. కానీ, కొత్త ఏడాదిలో తను అనూహ్యంగా పుంజుకుంది. మలేషియా ఓపెన్‌లో చెలరేగిపోతున్న భారత స్టార్ గురువారం ప్రీ-క్వార్టర్స్‌లో జపాన్ షట్లర్ తొమొక మియాజకీని చిత్తు చేసింది. టాప్ గేర్‌లో రెచ్చిపోయిన తెలుగుతేజం తొలి సెట్‌ను 21-8తో సునాయసంగా గెలుచుకుంది. రెండో సెట్‌లనూ సింధు ధాటికి ఎనిమిదో సీడ్ తొమొకను 21-13తో అలవోకగా మట్టికరిపించింది. సెమీస్ బెర్తు కోసం తను జపాన్‌కే చెందిన మూడో సీడ్ అకనె యమగుజితో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ ముందే ఇంటిదారి పట్టారు. డబుల్స్‌లో సాత్విక్ ఉ చిరాగ్ జోడీ తిరుగులేని ఆటతో క్వార్టర్స్ చేరింది. నిరుడు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలుపొందిన ఈ జంట మలేషియా ఓపెన్‌లోనూ పతకానికి మరింత చేరువైంది. గురువారం జరిగిన 39 నిమిషాల పోరులో జునైదీ అరిఫ్ ఉ రాయ్ కింగ్ యాప్(మలేషియా) జంటను 21-18, 21-12తో ఓడించింది సాత్విక్ ఉ చిరాగ్ ద్వయం.

## సెమీఫైనల్లో నిఖత్ జరీన్

### సీనియర్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జోరు

సీనియర్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ బాక్సర్, తెలంగాణ బిడ్డ నిఖత్ జరీన్ దుమ్మురేపుతోంది. ప్రత్యర్థులపై పంచ్‌లు కురిపిస్తూ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది.గ్రేటర్ నోయిడాలోని గౌతమ్ బుద్ధ యూనివర్సిటీ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టూ టైమ్ వరల్డ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌తో పాటు వరల్డ్‌కప్ గోల్డ్ మెడలిస్ట్ హితేష్ గులియా, వరల్డ్ ఛాంపియన్ మీనాక్ష హుడా విజయం సాధించి సెమీఫైనల్ బెర్తులను ఖరారు చేసుకున్నారు. మహిళల 45-48 కేజీల విభాగంలో ఆలిండియా పోలీస్ తరఫున బరిలోకి దిగిన మీనాక్ష 5-0తో పంజాబ్ బాక్సర్ కాశిష్ మెహతాను ఓడించింది. మహిళల 48-51 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ 5-0తో మణిపూర్‌కు చెందిన లాంచెన్‌బీ చాను టోంగ్‌బ్రామ్‌ను చిత్తు చేసింది. మహిళల 51-54 కేజీల విభాగంలో ప్రీతి 5-0తో హర్మీత్ కౌర్‌పై, సాక్ష 4-1తో పూనమ్‌పై విజయం సాధించారు. పురుషుల 65-70 కేజీల కేటగిరిలో హితేష్ 5-0తో పంజాబ్ బాక్సర్ తేజస్వినిని ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. పురుషుల 50-55 కేజీల విభాగంలో వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్ సిల్వర్ మెడలిస్ట్ పవన్ భార్త్వాల్, అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన టైసన్‌ను ఓడించగా, జదుమణి సింగ్ (50-55 కేజీలు) పంజాబ్ బాక్సర్ నిఖిల్ పై విజయం సాధించాడు. 55-60 కేజీల విభాగంలో సచిన్.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కరణ్‌ను ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్ చేరిన బాక్సర్లకు కనీసం కాంస్య పతకం ఖాయం కానుంది.







## న్యూజిలాండ్‌కు తిలక్ దూరం

పొట్టి ప్రపంచకప్ కోసం సిద్ధమవుతున్న తిలక్ వర్మ గురించి అభిమానుల్లో నెలకొన్న ఆందోళనే నిజమైంది. బుధవారం రాజ్‌కోట్‌లో సర్జరీ చేయించుకున్న ఈ చిచ్చరపిడుగు స్వదేశంలో న్యూజిలాండ్‌తో పొట్టి సిరీస్‌కు దూరమయ్యాడు. ఈ విషయాన్ని గురువారం భారత క్రికెట్ నియంత్రణ మండలి వెల్లడించింది. తిలక్ ఆరోగ్యంపై కీలక ప్రకటన చేసిన బీసీసీఐ.. కివీస్‌తో జరుగబోయే పొట్టి సిరీస్‌లో మొదటి మూడు టీ20లకు అందుబాటులో ఉండడని స్పష్టం చేసింది. 'సర్జరీ చేయించుకున్న తిలక్ వర్మ గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. అతడు శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్తాడు. ప్రస్తుతానికి తిలక్ ఆరోగ్యం నిలకడగా ఉంది. అతడు వేగంగా కోలుకుంటున్నాడు. పూర్తిగా కోలుకున్నాక అతడు ప్రాక్టీస్, నైపుణ్యాన్ని మెరుగుపరిచే పనులు మొదలుపెడతాడు. కాబట్టి.. న్యూజిలాండ్‌తో పొట్టి సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండడు. త్వరగా కోలుకొని ఫిట్‌గా ఉంటే చివరి రెండు మ్యాచుల్లో (జనవరి 28న వైజాగ్‌లో, జనవరి 31న త్రివేండ్రంలో) ఆడే అవకాశముంది' అని బీసీసీఐ పేర్కొంది.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 9-1-2026

# మాతృభూమితో మమకారం

భారతదేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలుస్తోంది. ఈ ప్రయాణంలో భారత గడ్డపై నివసించే 140 కోట్ల మంది ప్రజల శ్రమ ఎంత ఉందో, ఖండాంతరాల అవతల ఉంటూ భారతదేశ కీర్తి పతాకాన్ని ఎగురవేస్తున్న 3.2 కోట్ల మంది ప్రవాస భారతీయుల కృషి కూడా అంతే ఉంది. ఈ బంధాన్ని గౌరవించుకోవడమే 'ప్రవాసీ భారతీయ దివస్' పరమార్థం. 1915 జనవరి 9న మహాత్మా గాంధీ దక్షిణ ఆఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చారు. ఒక ప్రవాసిగా వెళ్లిన గాంధీ, అక్కడ జాతి వివక్షపై పోరాడి, తిరిగి వచ్చి భారత స్వతంత్ర సంగ్రామానికి నాయకత్వం వహించారు. ఆయన రాక భారతదేశ చరిత్రను మలుపు తిప్పింది. అందుకే, ప్రవాస భారతీయుల శక్తిని గుర్తించడానికి, వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడానికి అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం 2003లో ఈ ప్రవాసీ భారతీయ దివస్‌ను ప్రారంభించింది.



దూస సంతోష్
సౌదీ అరేబియా (ప్రవాస భారతీయుడు)

ప్రవాస భారతీయులు కేవలం విదేశాలలో స్థిరపడిన వ్యక్తులు మాత్రమే కాదు, వారు భారతదేశపు సంస్కృతికి, విలువలకు ప్రాతినిధ్యం వహించే 'అంబాసిడర్లు'. సిలికాన్ వ్యాలీ నుంచి వాల్ స్ట్రీట్ వరకు, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల సీఈఓలుగా భారతీయులు రాణిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా రెమిటెన్స్‌లు పొందుతున్న దేశం భారతదేశం. ఏటా సుమారు 100 బిలియన్ డాలర్ల పైచిలుకు విదేశీ మారక ద్రవ్యం ప్రవాసుల ద్వారా అందుతోంది, ఇది మన విదేశీ నిల్వలకు పెద్ద ఊతం. అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాల్లో భారతీయులు కీలక రాజకీయ పదవుల్లో ఉండటం వల్ల ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడుతున్నాయి. గత దశాబ్ద కాలంలో భారత ప్రభుత్వం ప్రవాసులతో బంధాన్ని మరింత బలోపేతం చేసింది. ప్రవాసులకు భారతదేశంతో శాశ్వత సంబంధం ఉండేలా ఓసీఐ కార్డుల జారీ ప్రక్రియను సులభతరం చేయడం వంటివి కీలక పాత్ర పోషించాయి. విదేశాల్లో భారతీయులకు ఏ కష్టం వచ్చినా 'వందే భారత్' మిషన్ లేదా 'ఆపరేషన్ గంగ' వంటి కార్యక్రమాల ద్వారా వారిని సురక్షితంగా తీసుకురావడం ప్రభుత్వ బాధ్యతగా మారింది. 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' వంటి పథకాల ద్వారా ప్రవాస భారతీయుల పెట్టుబడులను ఆకర్షించడం హర్షించదగ్గ నిర్ణయాలు. అయితే, ప్రవాసుల విజయాలు గర్వకారణమైనా, కొన్ని సవాళ్లు ఇంకా మిగిలే ఉన్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న కార్మికుల భద్రత, వారి సామాజిక భద్రతా పథకాలు వంటి అంశాలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సి ఉంది. అలాగే, విదేశాల్లో పుట్టి పెరుగుతున్న తర్వాతి తరం భారతీయులకు మన దేశ సంస్కృతి, వారసత్వంతో అనుసంధానం చేయడం ఒక సవాలు. భారతదేశం 'వసుధైక కుటుంబం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే సిద్ధాంతాన్ని నమ్ముతుంది. ఈ సిద్ధాంతానికి నిలువెత్తు రూపాలే మన ప్రవాస భారతీయులు. వారు ఏ దేశంలో ఉన్నా, ఏ రంగంలో ఉన్నా వారి హృదయం భారతదేశం కోసమే స్పందిస్తుంది. ప్రవాసీ భారతీయ దివస్ అనేది కేవలం ఒక వేడుక కాదు, అది మాతృభూమి పట్ల బాధ్యతను గుర్తుచేసే రోజు. భారతదేశం 2047 నాటికి వికసిత్‌గా మారాలనే లక్ష్యంలో ప్రవాస భారతీయుల మేధస్సు, పెట్టుబడి, మద్దతు అత్యంత కీలకం.







# ఆశల మార్పు.. ఆచరణలో పెదవి విరుపు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన మూడవ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. కాంగ్రెస్ ప్రకటించిన 'ఆరు గ్యారంటీలు' చూసి కొత్త ఆశలతో హస్తం పార్టీకి పట్టం కట్టారు. అయితే, అధికారం చేపట్టిన కొద్ది కాలానికే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారుతున్నాయి. హామీల అమలులో జాప్యం, పరిపాలన కంటే రాజకీయ ప్రాధాన్యాలు, అంతర్గత విభేదాలు వెరసి సామాన్య ప్రజానీకంలో ఒక రకమైన అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం ఆరు గ్యారంటీలు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పట్ల ఆదరణ ఉన్నప్పటికీ, రూ. 2,500 నగదు బదిలీ పథకం ఇంకా అందరికీ చేరకపోవడంపై నిరసన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో అందిన 'రైతు బంధు' కంటే మెరుగైన సహాయం అందుతుందని ఆశించిన రైతులకు, సాంకేతిక కారణాలు, నిబంధనల పేరుతో సహాయం ఆలస్యం కావడం మింగుడు పడటం లేదు. రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని ప్రకటించి, ఆ తర్వాత విడతల వారీగా, అది కూడా రేషన్ కార్డులు, ఇతర నిబంధనల సాకుతో వడపోత పట్టడం రైతాంగంలో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఇక, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్', 'హైడ్రా' కూల్చివేతలు నగర ప్రజల్లో చర్చనీయాంశమయ్యాయి. చెరువుల ఆక్రమణలను తొలగించాలన్న ఉద్దేశ్యం మంచిదే అయినా, పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చివేయడం 'బలవంతుడికి ఒక న్యాయం, బలహీనుడికి ఒక న్యాయమా?' అన్న ప్రశ్నను లేవనెత్తింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేని సమయంలో వేల కోట్ల రూపాయలతో మూసీ ప్రాజెక్టు అవసరమా? అన్నది సామాన్యుడి పెదవి విరుపుకు ప్రధాన కారణం.

పాలన కంటే రాజకీయాలకే పెద్దపీట

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పాలనపై కంటే గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం, విచారణలు జరపడంపైనే ఎక్కువ సమయం వెచ్చిస్తోందన్న భావన ప్రజల్లో ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడంపై ప్రజాస్వామ్యవాదులు పెదవి విరుస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను గతంలో తప్పుబట్టిన కాంగ్రెస్, ఇప్పుడు అదే బాటలో పయనించడం నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇక, ముఖ్యమంత్రి, మంత్రులు తరచుగా ఢిల్లీ పర్యటనలు చేయడం, ప్రతి నిర్ణయానికి అధిష్టానం అనుమతి కోసం వేచి చూడటం వల్ల నిర్ణయాధికారంలో జాప్యం జరుగుతోందని విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ కాంగ్రెస్‌కు మొదటి నుంచీ గ్రూపు రాజకీయాలు శాపం. అధికారంలోకి వచ్చాక కూడా మంత్రుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సీనియర్ నాయకులు తమ ఆధిపత్యం కోసం ప్రయత్నించడం, ప్రొటోకాల్ గొడవలు మీడియాకెక్కడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటోంది. ఇది కేడర్‌లో అయోమయానికి, ప్రజల్లో అపనమ్మకానికి దారితీస్తోంది. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు. మార్పును ఆహ్వానించినట్టే, మోసాన్ని కూడా అంతే త్వరగా గుర్తిస్తారు. కాంగ్రెస్ తన రాజకీయ పంథను మార్చుకుని, ప్రజల పెదవి విరుపును చిరునవ్వుగా మార్చకపోతే భవిష్యత్తు సవాలుగా మారే ప్రమాదం ఉంది.

### వర్గం.. ప్రధాన అసంతృప్తి అంశం:

నిరుద్యోగులు: జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం, గ్రూప్ పరీక్షల గందరగోళం

రైతులు: కొత్త రైతు భరోసా అందకపోవడం, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు

మధ్యతరగతి: ఆస్తి పన్నుల పెంపు ఆలోచన, విద్యుత్ చార్జీల పెరుగుదల భయం.

ప్రభుత్వ ఉద్యోగులు: పాత పెన్షన్ విధానంపై స్పష్టత లేకపోవడం, బకాయిల చెల్లింపు

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.